ప్రజా వాయిస్

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:110 | ఎడిటర్: మేనం శ్యామ్ | బుధవారం 11-11-2026 | పేజీలు: 13





సిరా చుక్క

ప్రతీకార రాజకీయాలు ఇంకెన్నాళ్లు ?
వాళ్లొస్తే వీళ్లపై కక్షలు..
వీళ్లొస్తే వాళ్లపై పగలు,
అధికారం మారినా
మారని రాజకీయాల తీరు!
పంతాల కోసం పాలనను
పక్కన పెడుతూ,
ప్రజల ఆశలను
అంధకారంలోకి నెడుతూ..
కుర్చీల కోసం కొట్లాటలు..
ప్రజల కోసం ఏవీ లేవు,
హామీలెన్నో ఇచ్చినా..
ఆచరణలో ఆనవాళ్లు లేవు!
కక్షలు వీడి ప్రజాసేవకు కదిలేదెన్నడు?
ప్రతీకార రాజకీయాలు ఆగేదెన్నడు?

వడ్ల మనోహర్, కోట్ పల్లి

పోలీస్ శాఖలో బదిలీల వేడి



- డీఎస్పీల కుర్చీలకు కదలిక
- ఖాళీల భర్తీపై డీజీపీ కసరత్తు
- ఎమ్మెల్యేలకు ఫోన్లు.. నేడో రేపో ఉత్తర్వులపై ఉత్కంఠ
- మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులకు స్థానచలనం

ప్రజా వాయిస్ డెస్క్, హైదరాబాద్. తెలంగాణ పోలీస్ శాఖలో బదిలీల వేడి మొదలైంది. డీఎస్పీల బదిలీలకు ఉన్నతాధికారులు కసరత్తు వేగవంతం చేసినట్లు సమాచారం. నెలల తరబడి ఖాళీగా ఉన్న డీఎస్పీ, ఏసీపీ పోస్టుల భర్తీతో పాటు ఒకే సబ్ డివిజన్‌లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న అధికారులకు స్థానచలనం కల్పించే దిశగా అడుగులు పడుతున్నట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఖాళీల వివరాలు సేకరించడంతో పాటు బదిలీల జాబితా రూపకల్పనపై ఉన్నతాధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. దీంతో ఎవరికి ఎక్కడ పోస్టింగ్ దక్కుతుంది.. ఎవరికి స్థానచలనం తప్పదు..అన్న ఉత్కంఠ పోలీస్ వర్గాల్లో నెలకొంది.

ఖాళీ పోస్టులపై గురి.. ఇన్ చార్జిలకు విముక్తి..

రాష్ట్రంలోని పలు కీలక పోలీస్ సబ్ డివిజన్లలో డీఎస్పీ, ఏసీపీ పోస్టులు చాలాకాలంగా ఖాళీగా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, సీసీఎస్‌తో పాటు వరంగల్, జనగామ, మిర్యాలగూడ తదితర ప్రాంతాల్లో డీఎస్పీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయి అధి కారులు లేకపోవడంతో ఇన్‌చార్జిలే విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీలన్నింటినీ భర్తీ చేసి పోలీస్ పాలనను మరింత పటిష్టం చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

మూడేళ్లుగా ఒకేచోట.. కదలనున్న కుర్చీలు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత జరిగిన బదిలీల్లో పలువురు డీఎస్పీలు తమకు కేటా యించిన సబ్ డివిజన్లలో బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి కొందరు అధికారులు దాదాపు మూడేళ్లుగా అదే స్థానంలో కొన సాగుతున్నారు. తాజా బదిలీల్లో వీరికి స్థానచలనం తప్పదనే ప్రచారం సాగుతోంది. ఖాళీల భర్తీతో పాటు దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న అధికారులను ఇతర ప్రాంతాలకు పంపించే అవకాశాలున్నట్లు సమాచారం.

డీజీపీ సీవీ ఆనంద్ కు తొలి బదిలీల జాబితా..

డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు చేపట్టిన తర్వాత లా అండ్ ఆర్డర్ డీఎస్పీ పోస్టుల భర్తీకి సంబంధించి వెలువడనున్న తొలి బదిలీల జాబితా కావడంతో ఈ వ్యవహారం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి డీఎస్పీలుగా పదోన్నతి పొందిన 37 మందికి లూప్‌లైన్ పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ జాబితాలో లా అండ్ ఆర్డర్ పోస్టింగులు లేకపోవడంతో పదోన్నతి పొందిన అధికారులకు పూర్తిస్థాయి పోస్టింగులు ఎప్పుడు వస్తాయనే ఆసక్తి నెలకొంది. లా అండ్ ఆర్డర్ పోస్టింగులు కూడా ఇస్తామని డీజీపీ సమావేశంలో వెల్ల డించినట్లు సమాచారం.

ఖాళీల వివరాలు పంపాలని ఆదేశాలు.. వేగవంతమైన ప్రక్రియ..

జిల్లాల్లో ఖాళీగా ఉన్న డీఎస్పీ పోస్టుల వివరాలను వెంటనే పంపిం చాలని డీజీపీ సీవీ ఆనంద్ సోమవారం యూనిట్ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాల ఎస్పీలు, కమిషనరేట్ల సీపీలు తమ పరిధిలోని ఖాళీల వివరాలను ఉన్నతాధికారులకు అందజేశారు. ఇప్పటికే ఖాళీల వివరాలు

మిగతా 2లో

రాహుల్‌తో మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ

- తెలంగాణ కాంగ్రెస్‌పై కీలక చర్చలు
- ఓబీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంపై ప్రధానంగా చర్చ
- నవంబర్ 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్
- గిగ్ వర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని రాహుల్ సూచన
- ఎస్ఐఆర్ వ్యతిరేక సభ, మెగా బీసీ ర్యాలీపై చర్చ
- నవంబర్ చివరి నాటికి నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తి చేస్తామని వెల్లడి



ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణ కేంద్రంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక నిర్ణయాలకు సిద్ధమవుతు న్నారు. ఢిల్లీలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆయనతో భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో నవంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించనున్న భారత్ సమ్మిట్‌కు హాజరుకా వాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో ఓబీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, తెలంగాణలో పార్టీ పరి స్థితులు, సంస్థాగత కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు.

ఓబీసీలకు రాజకీయ ప్రాధాన్యంపై చర్చ

దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో వెనుకబడిన తర గతులకు రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని రాహుల్ గాంధీకి వివరించినట్లు మహేశ్‌కు మార్ గౌడ్ తెలిపారు. పార్టీ బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపడుతున్న సంస్థాగత కార్యక్రమాల వివ రాలతో కూడిన నివేదికను ఆయనకు అందజేశారు. తెలం గాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేపడుతున్న చర్యలపై చర్చించినట్లు వెల్లడించారు.

గిగ్ వర్కర్లతో రాహుల్ ప్రత్యేక సమావేశం

భారత్ సమ్మిట్‌తో పాటు గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని రాహుల్ గాంధీ సూచిం చినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో వారితో సమావేశమై సమస్యలు, హక్కులపై చర్చించాలని రాహుల్ నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గిగ్ వర్కర్లను ఉద్దేశించి రాహుల్ ప్రసంగించే అవకాశం ఉందని వెల్లడించారు.

ఎస్ఐఆర్ వ్యతిరేక సభ.. మెగా బీసీ ర్యాలీ

హైదరాబాద్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిర్వహించ నున్న సభపై కూడా రాహుల్‌తో చర్చించినట్లు టీపీసీసీ అధ్యక్షుడు తెలిపారు. తెలంగాణలో మెగా బీసీ ర్యాలీ నిర్వ హణకు రావాలని ఆహ్వానించినట్లు చెప్పారు. ఈ కార్యక్ర మాలకు రాహుల్ నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు వివరించారు.

నామినేటెడ్ పోస్టుల భర్తీపై స్పష్టత

రాష్ట్ర మంత్రులు, ఎంపీల మధ్య విభేదాలు, ఢిల్లీలో చోటు చేసుకున్న పరిణామాలపై రాహుల్‌తో జరిగిన సమావే శంలో చర్చ జరగలేదని మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ అంశాలను పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చూసుకుంటారని తెలిపారు. నవంబర్ చివరి నాటికి తెలంగాణలో నామినే టెడ్ పోస్టుల భర్తీ పూర్తవుతుందని వెల్లడించారు. సోనియా గాంధీ ఆత్మకథ పుస్తకంపై తెలంగాణలోనూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

వివాహేతర సంబంధం గుట్టు రట్టు చేస్తాడని బాలుడి హత్య

- ఖమ్మం జిల్లాలో దారుణ ఘటన
- ప్రాణాలు కోల్పోయిన పదో తరగతి విద్యార్థి
- తమ సంబంధాన్ని చూశాడని బాలుడిపై కక్ష పెంచుకున్న మహిళ, యువకుడు
- కుటుంబ సభ్యులకు చెబుతాడనే భయంతో హత్యకు పథకం
- గ్రామ శివారులో కూల్‌డ్రింక్‌లో కలుపు మందు కలిపి ఇచ్చినట్లు ఆరోపణ
- నిందితులు అపర్ణ, అజయ్ అరెస్ట్.. కోర్టు ఆదేశాలతో రిమాండ్



2 లో

పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితం మళ్లీ చర్చలోకి

- రోజా పాత వ్యాఖ్యలు వైరల్
- పవన్ మూడు పెళ్లిళ్ల అంశంపై గతంలో రోజా చేసిన వ్యాఖ్యలు మరోసారి తెరపైకి
- మహిళల గౌరవం, విడాకులపై రోజా అప్పట్లో చేసిన ప్రశ్నలు
- వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాల్లోకి లాగవద్దంటూ పవన్ గతంలో స్పందన
- అన్నా లెజ్నెవాతో విడిపో యారంటూ వస్తున్న వార్తలతో సామాజిక మాధ్యమాల్లో చర్చ



2 లో

బతికున్నవారికి మరణ ధ్రువీకరణ పత్రాలు

- సిద్దిపేట జిల్లా రాంపూర్‌లో వెలుగుచూసిన నకిలీ డెత్ సర్టిఫికెట్ల బాగోతం
- గ్రామపంచాయతీ ఈ-సైన్ డిజిటల్ టోకెన్ దుర్వినియోగం
- హైదరాబాద్‌లో ఇంటర్నెట్ కేంద్రం నిర్వహిస్తున్న వ్యక్తికి టోకెన్ అప్పగింత
- ఆరు నెలల్లో 22 నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ అయినట్లు గుర్తింపు
- కార్యదర్శి మధు సస్పెన్షన్.. ఇద్దరిపై పోలీసుల కేసు నమోదు



ప్రజా వాయిస్, సిద్దిపేట: ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాల జారీలో అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం ఎలా దుర్వినియో గానికి దారితీస్తాయో చెప్పేందుకు సిద్దిపేట జిల్లాలో వెలుగు చూసిన ఘటన నిదర్శనంగా నిలుస్తోంది. బతికి ఉన్న వ్యక్తుల పేర్లతో మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన వ్యవహారం రాంపూర్ గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. ఈ బాగోతంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మధుతో పాటు అదే గ్రామానికి చెందిన శవల్ల రమేశ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ-సైన్ టోకెన్ అప్పగింతతో అక్రమాలు

చేర్యాల మండలం రాంపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మధు.. పంచాయతీకి చెందిన ఈ-సైన్ డిజిటల్ టోకెన్ (డొంగల్ కీ)ను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్‌లో ఇంటర్నెట్ కేంద్రం నిర్వహిస్తున్న శవల్ల రమేశ్‌కు ఈ టోకెన్‌ను అప్పగించినట్లు సమాచారం. దీన్ని ఆసరాగా చేసుకుని సుమారు ఆరు నెలల వ్యవధిలో 22 నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు గుర్తించారు.

మిగతా 2లో

కల్లం మోడ్రన్ రైస్ మిల్స్‌పై ఈడీ కొరడా

- రూ.18.33 కోట్ల ఆస్తులు అటాచ్
- ఏపీ, తెలంగాణలో 50 స్థిరాస్తులు, 5 ఫ్లాట్లు జప్తు
- బ్యాంకు రుణాల మోసం కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద చర్యలు
- ఎస్‌బీహెచ్ నుంచి రూ.24.57 కోట్ల రుణాలు పొందినట్లు గుర్తింపు
- నకిలీ, ఫోర్జరీ ఆస్తి పత్రాలతో రుణాలు తీసుకున్నారనే ఆరోపణలు
- మూడు సంస్థల ఖాతాల నుంచి రూ.23.81 కోట్ల నగదు ఉపసంహరణ
- బంధువులు, ఉద్యోగులు, అనుచరుల పేర్లతో 26 సంస్థలు నిర్వహించినట్లు ఈడీ వెల్లడి

2 లో

2029 చివరి నాటికి దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

- అమిత్ షా
- గుజరాత్‌లో ఏడాది ముందుగానే డ్రగ్స్ రహిత లక్ష్యాన్ని సాధించాలని పిలుపు
- డిసెంబర్ 1 నుంచి ప్రత్యేకంగా 1033 టోల్‌ఫ్రీ నంబర్ అందు బాటులోకి
- డ్రగ్స్ అక్రమాలపై ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడి
- మాదకద్రవ్యాల ద్వారా వచ్చే నల్లధనం ఉగ్రవాదానికి మళ్లుతోందని ఆందోళన



- బాధితుల కోసం ప్రత్యేక పునరావాస కేంద్రాల ఏర్పాటు

ప్రజా వాయిస్, న్యూఢిల్లీ: దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. 2028 డిసెంబర్ 31 నాటికి గుజరాత్‌ను పూర్తిస్థాయిలో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రకటిం చారు. దేశవ్యాప్తంగా 2029 డిసెంబర్ 31 నాటికి 'డ్రగ్ ఫ్రీ ఇండియా' సాధించాలని లక్ష్యంగా పెట్టు కున్నామని తెలిపారు.

మిగతా 2లో

వివాహేతర సంబంధం గుట్టు రట్టు చేస్తాడని బాలుడి హత్య

ప్రజా వాయిస్, ఖమ్మం: వివాహేతర సంబంధాల నేపథ్యంలో చోటుచేసుకుంటున్న నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తమ వ్యక్తిగత వ్యవహారం బయటపడుతుందనే భయంతో అమాయకుల ప్రాణాలు తీసేందుకు కూడా కొందరు వెనుకాడటం లేదు. తాజాగా ఖమ్మం జిల్లాలో ఇలాంటి ఘోర ఘటన వెలుగులోకి వచ్చింది.

తమ వివాహేతర సంబంధాన్ని చూశాడని, కుటుంబ సభ్యులకు చెబుతాడనే భయంతో పదో తరగతి విద్యార్థిని హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

సంబంధాన్ని చూశాడని బాలుడిపై కక్ష

పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్నకొరుకొండ గ్రామానికి చెందిన అపర్ణ భర్తతో విడిపోయి తన అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన అజయ్ అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం క్రమంగా వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇటీవల వారిద్దరూ కలిసి ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన జిల్లెళ్ల రవి (15) అనే పదో తరగతి విద్యార్థి వారిని చూశాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు చెబుతానని హెచ్చరించినట్లు సమాచారం.

కూల్‌డ్రింక్‌లో కలుపు మందు కలిపి..

తమ సంబంధం బయటపడుతుందనే భయంతో అపర్ణ, అజయ్ కలిసి రవిని అంతమొందించాలని నిర్ణయించుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో గత నెల 24న మాట్లాడాలంటూ గ్రామ శివారు ప్రాంతానికి బాలుడిని పిలిపించారు. అక్కడ కూల్‌డ్రింక్‌లో కలుపు మందు కలిపి తాగించినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం బాలుడి ఆరోగ్య పరిస్థితి క్రమంగా క్షీణించింది.

చికిత్స పొందుతూ మృతి..
నిందితులకు రిమాండ్

బాలుడి పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు అక్టోబర్ 25న రవిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవి మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి అపర్ణ, అజయ్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.చిన్న వయసులోనే పదో తరగతి విద్యార్థి ప్రాణాలు కోల్పోవడంతో చిన్నకొరుకొండ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఓ వ్యక్తిగత వ్యవహారం బయటపడుతుందనే భయంతో బాలుడి ప్రాణాలు తీసిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది.

కల్లం మోడ్రన్ రైస్ మిల్స్‌పై ఈడీ కొరడా



ప్రజా వాయిస్, హైదరాబాద్:కల్లం మోడ్రన్ రైస్ మిల్స్ బ్యాంకు రుణాల మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు కీలక చర్యలు చేపట్టారు. సంస్థకు చెందిన కల్లం పేరిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులకు సంబంధించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని రూ.18.33 కోట్ల విలువైన స్థిరాస్తులను అటాచ్ చేశారు. బ్యాంకు రుణాల మోసం ద్వారా వచ్చిన సొమ్మును మనీలాండరింగ్‌కు పాల్పడి ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు రావడంతో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఈ చర్యలు తీసుకున్నారు.

రూ.24.57 కోట్ల బ్యాంకు రుణాలు

ఈడీ దర్యాప్తు ప్రకారం.. 2010 నుంచి 2013 మధ్య స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్) నుంచి కల్లం గ్రూపు సంస్థలు రూ.24.57 కోట్ల రుణాలు పొందాయి. కల్లం మోడ్రన్ రైస్ మిల్స్ నకిలీ, ఫోర్జరీ ఆస్తి పత్రాలను తనఖా పెట్టి రుణాలు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో బ్యాంకుకు రూ.18.33 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ఆరోపణలు ఉన్నాయి.

26 సంస్థల పేర్లతో లావాదేవీలు

కల్లం మోడ్రన్ రైస్ మిల్స్‌తో పాటు శ్రీ రామబ్రహ్మ మోడ్రన్ రైస్ మిల్స్, శ్రీ వినాయక ట్రేడర్స్ పేర్లతో రుణాలు తీసుకున్నట్లు ఈడీ విచారణలో వెల్లడైంది. బంధువులు, ఉద్యోగులు, అనుచరుల పేర్లతో సుమారు 26 సంస్థలను నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు. ఈ మూడు సంస్థల క్యాష్ క్రెడిట్ ఖాతాల నుంచి రూ.23.81 కోట్ల నగదును ఉపసంహరించినట్లు తెలిపారు. కార్మికులు, అకౌంటెంట్లు, కల్లం పేరిరెడ్డి పేర్లతో నగదు విత్‌డ్రా చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు.

రుణాల సొమ్ముతో ఆస్తుల కొనుగోళ్లు

బ్యాంకు రుణాల ద్వారా పొందిన సొమ్ముతో పలు స్థిరాస్తులను కొనుగోలు చేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. అనంతరం బంధువులు, అనుచరుల పేర్లకు నగదు చెల్లింపులు లేకుండానే ఆస్తులను బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. బంధువులు నామమాత్రపు యజమానులుగా ఉండగా, అసలు లబ్ధిదారుగా కల్లం పేరిరెడ్డి ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని ఈడీ వెల్లడించింది.

అటాచ్ చేసిన ఆస్తుల వివరాలు

ఈడీ అటాచ్ చేసిన ఆస్తుల్లో 50 స్థిరాస్తుల విలువ రూ.16.88 కోట్లు కాగా, ఐదు ప్లాట్ల విలువ రూ.1.45 కోట్లు. మొత్తంగా రూ.18.33 కోట్ల విలువైన ఆస్తులను అధికారులు అటాచ్ చేశారు. చెన్నై సీబీఐ ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. బ్యాంకు రుణాల మోసం, నిధుల మళ్లింపు, ఆస్తుల కొనుగోళ్లకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

పోలీస్ శాఖలో బదిలీల వేడి

మొదటి పేజీ తరువాయి

చేరడంతో బదిలీల ప్రక్రియ మరింత వేగం పుంజుకున్నట్లు పోలీస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఎమ్మెల్యేలకు ఫోన్లు..
పోస్టింగులపై రాజకీయ ఆరా..

డీఎస్పీల బదిలీల జాబితా సిద్ధం చేసే క్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు పలువురు ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి గతంలో వారు సిఫారసు చేసిన అధికారుల వివరాలపై ఆరా తీసినట్లు సమాచారం. కొందరు మంత్రులతోనూ డీఎస్పీల పోస్టింగుల అంశంపై చర్చించినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో బదిలీల్లో ఎవరికి ప్రాధాన్యత దక్కుతుంది..ప్రజాప్రతినిధుల సిఫారసులు ఎంతవరకు ప్రభావం చూపుతాయి.. అన్న చర్చ జోరందుకుంది.

నేడో రేపో ఉత్తర్వులు..
ఎవరి అదృష్టం ఎటువైపు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న అనంతరం డీఎస్పీల బదిలీలపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఖాళీల వివరాల సేకరణ, అధికారుల పోస్టింగులపై కసరత్తు కొనసాగుతుండటంతో నేడో రేపో అధికారిక ఉత్తర్వులు వెలువడవచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా డీఎస్పీల బదిలీల వ్యవహారం పోలీస్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది. ఎవరి కుర్చీ కదులుతుంది.. ఎవరి నిరీక్షణకు తెరపడుతుంది.. అన్నది అధికారిక ఉత్తర్వులు వెలువడితేనే స్పష్టత రానుంది.

2029 చివరి నాటికి దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

గుజరాత్‌లో ఏడాది ముందుగానే లక్ష్యం

అహ్మదాబాద్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా పాల్గొని సుమారు రూ.1,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇస్కాన్–సనంద్ ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు పలు గృహ నిర్మాణ ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చేందుకు చేపట్టిన చర్యల తరహాలోనే, ఇప్పుడు డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణంపై దృష్టి సారించామని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, తాను గుజరాత్‌కు చెందినవారమని, అందువల్ల దేశ లక్ష్యానికి ఏడాది ముందుగానే గుజరాత్‌ను డ్రగ్స్ రహితంగా మార్చాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్ సమాచారం కోసం 1033 టోల్‌ఫ్రీ నంబర్

గుజరాత్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు డిసెంబర్ 1 నుంచి ప్రత్యేకంగా 1033 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అమిత్ షా తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన అక్రమాలపై ప్రజలు ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని, ప్రత్యేక నియంత్రణ కేంద్రం ద్వారా ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డ్రగ్స్ సొమ్ము ఉగ్రవాదానికి మళ్లింపు

మాదకద్రవ్యాల విక్రయాల ద్వారా సమకూరుతున్న నల్లధనం ఉగ్రవాద కార్యకలాపాలకు మళ్లుతోందని అమిత్ షా ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు నిరంతరం గమనించాలని సూచించారు.

బాధితులకు పునరావాస కేంద్రాలు

మాదకద్రవ్యాల బారిన పడిన వారికి మెరుగైన వైద్యం, చికిత్స అందించేందుకు ప్రత్యేక డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. బాధితుల వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడంతో పాటు బాధితులకు చికిత్స, పునరావాసం కల్పించడం కూడా ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.



పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితం మళ్లీ చర్చలోకి



ప్రజా వాయిస్, అమరావతి:సినీ నటుడు, జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితం మరోసారి రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రష్యాకు చెందిన అన్నా లెజ్నెవాతో 13 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్లు పవన్ కల్యాణ్, అన్నా సంయుక్త ప్రకటన విడుదల చేశారు. పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోవాలని నిర్ణయించుకున్నామని, ఇకపై కూడా మంచి స్నేహితులుగా ఉంటూ పిల్లల బాధ్యతలను కలిసి చూసుకుంటామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, మాజీ మంత్రి ఆర్కే రోజా పవన్ మూడు పెళ్లిళ్లపై చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో మళ్లీ వైరల్ అవుతున్నాయి.

రోజా అప్పటి విమర్శలు ఏమిటంటే..

వైసీపీ ప్రభుత్వ హయాంలో పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా విమర్శించే క్రమంలో రోజా ఆయన వ్యక్తిగత జీవితాన్ని ప్రస్తావించారు. మూడు పెళ్లిళ్ల అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తూ, భార్యలను మార్చినంత సులభంగా మారుస్తారనే అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో నిలకడ గురించి మాట్లాడే పవన్ తన వ్యక్తిగత జీవితంలోనూ నిలకడ చూపడం లేదంటూ విమర్శించారు.

మహిళల గౌరవంపై ప్రశ్నలు

తన వివాహాల గురించి పవన్ గతంలో చేసిన వ్యాఖ్యలపై రోజా అభ్యంతరం వ్యక్తం చేశారు. విడాకులు ఇచ్చి భరణం చెల్లించి మరో పెళ్లి చేసుకున్నాననే వ్యాఖ్యల నేపథ్యంలో.. డబ్బులు చెల్లిస్తే మహిళలను వదిలించుకోవచ్చా? అంటూ ప్రశ్నించారు. ఇలాంటి వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయని విమర్శించారు. పండుగల సమయంలో భార్యతో కలిసి పవన్ కనిపించడం లేదంటూ అప్పట్లో వారి వైవాహిక బంధంపై కూడా వ్యాఖ్యలు చేశారు.

గతంలో పవన్ ఇచ్చిన సమాధానం

మరోవైపు తన వ్యక్తిగత జీవితంపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలకు పవన్ కల్యాణ్ గతంలో స్పందించారు. మొదటి వివాహానికి చట్టబద్ధంగా విడాకులు తీసుకున్న తర్వాతే మరో వివాహం చేసుకున్నానని, ఎవరినీ మోసం చేయలేదని స్పష్టం చేశారు. ముగ్గురు భార్యలతో ఒకేసారి కలిసి జీవించలేదని, తన వ్యక్తిగత జీవితాన్ని రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవద్దని వ్యాఖ్యానించారు.

13 ఏళ్ల బంధానికి ముగింపు

పవన్ కల్యాణ్, అన్నా లెజ్నెవా 2013లో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తాజాగా విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో విడిపోవడానికి గల కారణాలను వెల్లడించలేదు. తమ వ్యక్తిగత పరివర్తన సమయంలో గోప్యతను గౌరవించాలని అభిమానులు, శ్రేయోభిలాషులను కోరారు. ఈ పరిణామంతో రోజా గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చకు రావడం గమనార్హం.

బతికున్నవారికి మరణ ధ్రువీకరణ పత్రాలు

మొదటి పేజీ తరువాయి

ఇన్సూరెన్స్, భూ వ్యవహారాల కోసమేనా?

ఇన్సూరెన్స్ సొమ్ము పొందడం లేదా భూ సంబంధిత వ్యవహారాల్లో ప్రయోజనం పొందడం కోసం రమేశ్ తన కుటుంబ సభ్యులతో పాటు మరికొందరి పేర్లపై నకిలీ డెత్ సర్టిఫికెట్లు సృష్టించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ పత్రాల ఆధారంగా ఎలాంటి లబ్ధి పొందారనే అంశంపై పూర్తిస్థాయి విచారణ జరగాల్సి ఉంది.

ముందే ఆరోపణలు.. చర్యల్లో జాప్యమెందుకు?

పంచాయతీ కార్యదర్శి వ్యవహారంపై ఆరోపణలు వచ్చినప్పటికీ మండల స్థాయి అధికారులు తగిన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు నెలలుగా మధును ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహించేలా చేసినప్పటికీ, నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై సమగ్ర



విచారణ జరపలేదని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నిర్లక్ష్యానికి బాధ్యులెవరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కలెక్టర్ ఆదేశాలతో చర్యలు

ఈ వ్యవహారం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో పంచాయతీ కార్యదర్శి మధును సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించారు. అనంతరం ఎంపీవో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మధుతో పాటు శవల్ల రమేశ్‌పై కేసు నమోదైంది. నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? ఈ పత్రాలతో ఆర్థిక లేదా ఆస్తి సంబంధిత ప్రయోజనాలు పొందారా? అధికారుల నిర్లక్ష్యానికి కారణాలేమిటి? అనే అంశాలపై విచారణలో స్పష్టత రావాల్సి ఉంది.

కాంగ్రెస్ అధికార ప్రతినిధుల నియామకాలపై రగడ

- **టాలెంట్ హంట్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్న ఆరోపణలు..**
- **నియామకాల జాబితాపై పార్టీలో తీవ్ర అసంతృప్తి**
- **సిఫార్సులకే ప్రాధాన్యం ఇచ్చారంటూ నేతల అభ్యంతరం**
- **ఏఐసీసీ సెలక్షన్ కమిటీ సభ్యుల అసహనం**
- **వివాదం ముదరడంతో జాబితా తాత్కాలికంగా నిలిపివేత**
- **అర్హులకు ప్రాధాన్యమిస్తూ మరో జాబితా విడుదల చేసే అవకాశం**



ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అధికార ప్రతినిధుల నియామకాల వ్యవహారం కొత్త వివాదానికి దారితీసింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన నియామకాల జాబితాను అధిష్ఠానం అకస్మాత్తుగా హోల్డ్‌లో పెట్టడం పీసీసీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జాబితా విడుదలైన కొద్దిసేపటికే అసంతృప్తి వ్యక్తం కావడంతో పార్టీలో కలకలం రేగింది.

టాలెంట్ హంట్‌కు ప్రాధాన్యం ఎక్కడ?

ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘టాలెంట్ హంట్’ ప్రక్రియ ద్వారా పార్టీ కోసం కష్టపడిన, ప్రతిభ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు అవకాశం కల్పించాల్సి ఉండగా.. కీలక నేతల సిఫార్సులకే పెద్దపీట వేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో టాలెంట్ హంట్‌లో ఎంపికైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందంటూ పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

సెలక్షన్ కమిటీ అభ్యంతరాలు

ఈ నియామకాలపై ఏఐసీసీ సెలక్షన్ కమిటీ సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రతిభ ఆధారంగా ఎంపికైన వారిని పక్కనపెట్టి సిఫార్సులకు ప్రాధాన్యం ఇవ్వడం పార్టీ విధానాలకు విరుద్ధమనే అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం. ఇలాంటి పరిణామాలు పార్టీ శ్రేణుల్లో తప్పుడు సంకేతాలు పంపుతాయని ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

పునఃపరిశీలనకు అధిష్ఠానం నిర్ణయం?

వివాదం మరింత ముదరకుండా ఉండేందుకు ప్రకటించిన జాబితాను తాత్కాలికంగా నిలిపివేయాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు సమాచారం. ఎంపికల ప్రక్రియను మరోసారి సమీక్షించి, అర్హత, ప్రతిభకు తగిన ప్రాధాన్యం ఇచ్చేలా కొత్త జాబితాను రూపొందించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే అధికారికంగా తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది.

తెలంగాణలో అధికారం లక్ష్యంగా బీజేపీ దూకుడు

- **ఈ నెల 18న కరీంనగర్‌కు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్**
- **లక్ష మందితో మహా పాదయాత్రకు బండి సంజయ్ సన్నాహాలు**
- **అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ బలోపేతంపై దృష్టి**
- **కరీంనగర్‌లో నితిన్ నబీన్ తొలి పర్యటన**
- **‘సర్’ అంశంపై విపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు పాదయాత్ర**
- **గాంధీ సర్కిల్ నుంచి కమాన్ వరకు భారీ ర్యాలీ**
- **బూత్ స్థాయి నుంచి జన సమీకరణకు బండి సంజయ్ ఆదేశాలు**



ప్రజా వాయిస్, కరీంనగర్:వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) దూకుడు పెంచుతోంది. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల్లోకి బలంగా వెళ్లేందుకు జాతీయ నాయకుల పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఈ నెల 18న ఆయన నగరానికి రానుండటంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

‘సర్’ అంశంపై విపక్షాలకు కౌంటర్

‘సర్’ అంశంపై కాంగ్రెస్, ఇండీ కూటమి పార్టీలు రాజ్యాంగ సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు వివరించాలనే లక్ష్యంతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో భారీ పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నితిన్ నబీన్ తొలిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని బండి సంజయ్ భావిస్తున్నారు.

గాంధీ సర్కిల్ నుంచి కమాన్ వరకు

కరీంనగర్‌లోని గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు మహా పాదయాత్ర సాగనుంది. ఈ కార్యక్రమంలో నితిన్ నబీన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ తదితరులు పాల్గొననున్నారు. పాదయాత్రకు లక్ష మంది కార్యకర్తలు, ప్రజలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

జన సమీకరణపై సమీక్ష

పాదయాత్ర ఏర్పాట్లపై బండి సంజయ్ కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బూత్ స్థాయి నుంచి మండలాల వారీగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తలను పెద్ద సంఖ్యలో సమీకరించాలని సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు.తెలంగాణలో రాజకీయంగా పట్టు సాధించేందుకు బీజేపీ చేపడుతున్న ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని నాయకత్వం ఆశిస్తోంది.

ఇందిరాగాంధీ విగ్రహ ఆవిష్కరణకు మోక్షం ఎప్పుడో..?

- పోలీస్ పహారలో ' ఇందిరమ్మ, ' బంది..?
- ఇందిరాగాంధీ విగ్రహ ఏర్పాటు చేయాలని దుబ్బాక ప్రజల ఆకాంక్ష
- కాంగ్రెస్ పార్టీలో ఒక్కసారిగా బగ్గు మంటున్న వర్గ పోరు
- గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి ఆశయం నెరవేరేనా



ప్రజా వాయిస్/దుబ్బాక: మహనీయులుభారత దేశ మాజీ ప్రధానులు రాజీవ్ గాంధీ, ఇందిరాగాంధీ విగ్రహాల ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు గాడి పల్లి రఘువర్ధన్ రెడ్డి మూడు లక్షల రూపాయలు వెచ్చించితన సొంత డబ్బులతో దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని మాజీ ఇందిరా గాంధీ చౌరస్తాలో విగ్రహాలను ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో దిమ్మె గద్దెలను ఏర్పాటు చేస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీలో ఒక్కసారిగా భగ్గుమన్న వర్గం ఈ క్రమంలోనే విగ్రహ ఏర్పాటుకు పులిస్టాప్ పడింది గద్దె కూల్చడంపై విగ్రహాన్ని ఎత్తుకెళ్లడంపై గాడి పల్లి రఘువర్ధన్ రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు అనంతరం పోలీసుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన ప్రదేశంలోనే మళ్లీ తిరిగి తీసుకువచ్చి పెట్టారు సొంత పార్టీ వారు కావడంతో గాడి పల్లి రఘువర్ధన్ రెడ్డి కేసుని అంత సీరియస్గా తీసుకో లేదని ఆయన వర్గీయులు పేర్కొన్నారు సొంత పార్టీ నాయకులపై కేసులు పెట్టాలన్న ఆలోచన తనకు లేదని కేవలం ఏ స్వార్థపు ఆలోచనతో కాకుండా కాంగ్రెస్ పార్టీకి దుబ్బాకలో తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించిన మహనీయుల విగ్రహాలు దుబ్బాకలో ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో తీసుకున్నా నిర్ణయం మేరకే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు కానీ దీనికి భిన్నంగా కొన్ని రాజకీయ శక్తులు కూటమిగా కలిసి విగ్రహాల ఏర్పాటుకు అడ్డుగా తగిలారని ఇలాంటి పనులు చేయడం చాలా బాధాకరమైన విషయమని ఒకవైపు రాష్ట్ర నాయకులతో సంప్రదింపులు జరుపుతూ విగ్రహా ఏర్పాటు మహోత్సవ కార్యక్రమాన్ని దుబ్బాక నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరి సహకారంతో సభ ఏర్పాటు చేసి విగ్రహావిష్కరణకు రాష్ట్ర నాయకులు నుంచి మొదలుకొని వీలైతే రాష్ట్ర ముఖ్యమంత్రి సమయం కేటాయిస్తే ఆయనను కూడా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆహ్వాన పత్రికలు అందజేసేందుకు సన్నద్ధమవు తున్న తరుణంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం తన మనసును కలిసిందని గాడి పల్లి రఘువర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు తెలంగాణ ఉద్యమ సమయంలో ధ్వంసమైన విగ్ర హాలను తిరిగి అదే ప్రాంతంలో ప్రతిష్టించాలన్న తన నిర్ణయాన్ని కొందరు కావాలని తప్పుపడుతు న్నారని కానీ దుబ్బాక ప్రజలు, కాంగ్రెస్ అయో మయంలో ఉన్నారు.

పంచాయతీలో జీతాల పంచాయితీ.!

- డ్యూటీ చేయకుండానే జీతాలు..?
- కాకర్లపల్లె పంచాయతీలో వేతనాల చెల్లింపులపై వివాదం
- నెల రోజులుగా విధులకు దూరంగా కారోబార్
- హాజరు రికార్డుల్లో మాత్రం విధులకు వచ్చినట్లు నమోదు చేశారనే ఆరోపణలు
- చెక్కులపై సంతకానికి ఉప సర్పంచ్ నిరాకరణ



చెక్కులపై సంతకానికి నో చెప్పిన ఉప సర్పంచ్

ప్రజా వాయిస్,మంథని: పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాకర్లపల్లె గ్రామ పంచాయతీలో చోటుచేసుకున్న వేతనాల చెల్లింపుల వ్యవహారం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది.గ్రామ పంచాయతీలో కారో బార్గా పనిచేస్తున్న మల్లయ్య గత నెల రోజులుగా విధులకు హాజరు కావడం లేదని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఆయన విధులకు హాజరైనట్లు నోట్ ఫైల్లో నమోదు చేసి, సంతకాలు చేసినట్లు చూపిస్తూ వేతనం చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విధులకు రాని వ్యక్తికి వేతనం ఎలా చెల్లిస్తారన్న ప్రశ్నలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి.

అధికారుల విచారణతోనే నిజాలు వెలుగులోకి

కారోబార్ మల్లయ్య నిజంగానే విధులకు హాజరయ్యారా, నెల రోజుల హాజరు రికార్డుల్లో ఏముంది? నోట్ ఫైల్లో నమోదు చేసిన వివరాలకు ఆధారాలున్నాయా, వేతన బిల్లులకు ఎవరు ఆమోదం తెలిపారు? అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పాత్రపైనా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉందని, విధులకు హాజరుకాకుండానే వేతనాలు పొందినట్లు విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి హాజరు రికార్డులు, వేతన బిల్లులను పరిశీలిస్తారా లేక ఆరోపణలు కాగితాలకే పరిమితం అవుతాయా అన్నది వేచి చూడాలి.



ధాన్యం కొనుగోళ్లలో దళారుల దోపిడీ.!

- క్వింటాలుకు రూ.వెయ్యి నష్టం
- బస్తాకు 2.5 కిలోల కోత
- రైతులకు మద్దతు ధర కల్పించాలి
- నష్టపోయిన వారికి పరిహారం అందించాలి
- కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్

ప్రజా వాయిస్,చిలుకూరు: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. మంగళవారం చిలుకూరు మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తూకం, తాలు పేరుతో బస్తాకు 2.5 కిలోల కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారని, క్వింటాలుకు రూ.వెయ్యి వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించి దళారుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.ఎల్నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం, యూరియా కొరత, సాగునీటి సమస్యతో రైతులు ఇబ్బందులు పడు తున్నారని అన్నారు. అకాల వర్షాలు, తుఫాను లతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, కరువు భత్యం వెంటనే చెల్లించా లని ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అక్కినపల్లి జానకిరామాచారి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అల సగాని జనార్ధన్, బెల్లంకొండ నాగయ్య, మాజీ ఎంపీపీ కొండా అన్నపూర్ణ, అంబాల వెంకటి, షేక్ పాషా, లింగరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు నిగిడాల విరయ్య, బుడిగెం కిశోర్, తిపిరిశెట్టి కిరణ్, షాకింగ్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం ధరల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- కృత్రిమ కొరత సృష్టించినా.. అధిక ధరలకు విక్రయించినా ఉపేక్షించేది లేదు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరిక
- 50 దుకాణాల్లో తనిఖీలు.. 9 కేసులు నమోదు



ప్రజా వాయిస్ పెద్దపల్లి జిల్లాలో బియ్యం కృత్రిమ కొరత సృష్టిస్తూ వినియోగదారు లను ఇబ్బందులకు గురిచేసినా, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి విక్రయించినా సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు.
బియ్యం అక్రమ నిల్వలకు పాల్పడకుండా వ్యాపారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం మిల్లు వద్ద కిలో రూ.62, హోల్సేల్ ధర రూ.64, రిటైల్ ధర రూ.66గా నిర్ణయించారు. ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం బియ్యం ధరలు వరుసగా రూ.70, రూ.72, రూ.74గా ఉన్నాయి. హెచ్ఎంటీ, జై శ్రీరామ్ రకం బియ్యం ధరలు మిల్లు వద్ద రూ.75, హోల్సేల్లో రూ.77, రిటైల్లో రూ.79గా నిర్ణయించారు. ఈ ధరలకు మించి విక్రయించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. అక్టోబర్ 30న కలెక్టర్ ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని హోల్సేల్, రిటైల్ బియ్యం దుకాణాలు, గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్లు, ఆహార తనిఖీ అధికారులు బియ్యం నిల్వలు, ధరల పట్టికలు, తూకాలు, నిల్వ రికార్డులను పరిశీలించారు. నవంబర్ 4 నాటికి జిల్లావ్యాప్తంగా 50 దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 9 కేసులు నమోదు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రతి బియ్యం దుకాణం, మిల్లు ఎదుట వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా రోజువారీ నిల్వలు, విక్రయ ధరల వివరాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ, ఆహార భద్రత అనుమతిపత్రాలను సిద్ధంగా ఉంచాలని, రోజువారీ కొనుగోళ్లు, అమ్మకాల వివరాలను నిల్వ రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. 26 కిలోల బియ్యం బస్తా పేరుతో 24 లేదా 25 కిలోల బియ్యం మాత్రమే విక్రయిస్తే మోసపూరిత కొలతల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, అక్రమ నిల్వలు, ధరల్లో అక్రమాలు, తూకాల్లో తేడాలు, రికార్డుల నిర్వహణలో లోపాలు గుర్తిస్తే నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.



మియాపూర్ ప్రభుత్వ భూముల అమ్మకాన్ని అడ్డుకుంటాం

- 550 ఎకరాల్లో కాలనీలు పోను మిగిలిన 400 ఎకరాలను ప్రజా ప్రయోజనాలకే కేటాయించాలి
- పేదల ఇళ్ల జోలికొస్తే ఊరుకునేది లేదు
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,శేర్లింగంపల్లి నియోజకవర్గ ఇన్ ఛార్జ్ రవికుమార్ యాదవ్

ప్రజా వాయిస్||శేర్లింగంపల్లి: మియాపూర్లోని ప్రభుత్వ భూములను విక్రయించి సొమ్ము చేసుకోవా లని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేర్లింగంపల్లి నియోజ కవర్గ ఇన్ఛార్జ్ రవికుమార్ యాదవ్ హెచ్చరిం చారు.మియాపూర్ సర్వే నంబర్లు 100,101లోని సుమారు 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు ప్రభు త్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూముల విక్రయంపై చేసిన ప్రకటనను ఆయన తప్పుబట్టారు.ఎం.ఏ.నగర్ కాలనీని సందర్శించి,ఇళ్లు కోల్పోయే పరిస్థితి ఎదు ర్కొంటున్న బాధితులతో మాట్లాడిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ..సుమారు 550 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఎం.ఏ.నగర్, స్టాలిన్ నగర్ వంటి కాలనీలు విస్తరించి ఉన్నాయని,మిగిలిన దాదాపు 400 ఎకరాలను విక్రయించే బదులు ప్రజా అవసరా లకు వినియోగించాలని డిమాండ్ చేశారు.ఈ భూముల్లో పెద్ద ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ,ఇంజినీరింగ్ కళాశాలలు,పార్కులు ఏర్పాటు చేయడంతో పాటు నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించాలని సూచించారు.ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసం విక్రయించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, తరత రాలుగా నివసిస్తున్న పేదల ఇళ్ల జోలికి వస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.స్థానిక ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే భూముల విక్రయాన్ని అడ్డుకోవాలని కోరారు.ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే శేర్లింగంపల్లి నుంచే పోరాటం ప్రారంభించి, బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమం చేపడ తామని రవికుమార్ యాదవ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా,డివిజన్ నాయకులు మానిక్ రావు, విజయేందర్,ఆకుల లక్ష్మణ్, శ్రీనివాస్,సీతారామ రాజు, గణేష్ ముదిరాజ్, రాఘవేంద్ర రావు,నాగేశ్వర్ గౌడ్,సమ్మెట ప్రసాద్ తదితరులు,స్థానిక నాయకులు,కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పైసలిస్తే ప్రభుత్వ భూమికి పట్టా పాస్ బుక్కులు ఇస్తాం ?

- పట్టాదారుని సంతకం లేకుండానే పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చిన వైనం
- రాష్ట్ర సమాచార కమిషనర్ ఆదేశాలు బేకదరు
- రెవెన్యూ అధికారుల పనితీరుపై ప్రజల ఆగ్రహం



ప్రజా వాయిస్ హన్మకొండ /ఆత్మకూర్ పైసలిస్తే ప్రభుత్వ భూమికి కూడా పట్టా పాస్బుక్కులు ఇచ్చిన రెవెన్యూ అధికారుల పనితీరు మరోసారి బట్టబయలు అయింది. పట్టాకాలంలో ఉన్న పట్టాదారుని సంతకం లేకుండానే మరో ఇద్దరు వ్యక్తులకు పట్టాదారు పాసుబుక్ ఇచ్చిన రెవెన్యూ అధి కారుల పనితీరుపై మండల ప్రజలు మండి పడుతున్నారు. వివరాల్లోకి వెళితే పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండలం నీరుకుల్లా గ్రామ శివారులోని 678 సర్వే నెంబరు మూడు ఎకరాల 20 గుంటల భూమి బోడకుంట్ల మల్లేశం s% రాజయ్య పట్టాలో ఉన్నాడు. పట్టాదారుని కుమారుడు 2010 సంవత్సరం నుండి సమాచార హక్కు చట్టం ద్వారా రెవెన్యూ అధికారులకు పలుమార్లు దరఖాస్తు పెట్టుకున్నప్పటికీ పట్టించుకోలేదు. రెండవ అప్పిలు రెవిన్యూ డివిజన్ అధికారికి మూడవ అప్పిలు రాష్ట్ర సమాచార కమిషనర్ కు దరఖాస్తు చేసుకోవడంతో నీరుకుల్లా గ్రామ శివారులోని సర్వే నెంబరు 678 ప్రభుత్వ భూమిగా అప్పటి తాసిల్దార్ రాష్ట్ర సమాచార కమిషనర్ ముందు తెలిపారు. అట్టి భూమిని పట్టాదారుని ప్రమేయం లేకుండానే క్రయవిక్రయాలు జరిగి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన రెవెన్యూ అధికారుల పనితీరును మండల ప్రజలు దుయ్యబడుతున్నారు. రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన బాధితునికి సకాలంలో కోరిన సమా చారాన్ని నేటి వరకు ఇవ్వకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో కొందరి పెద్ద మనుషులకు ఇది ప్రభుత్వ భూమి అని తెలిసినప్పటికీ క్రయవిక్రయదారులు చేసే వ్యక్తుల వద్ద నుండి కొంత డబ్బును తీసుకొని కొందరు ప్రజా ప్రతినిధులు కూడా తోడై ప్రభుత్వ భూమిని పట్టాదారుని తెలియ కుండానే హద్దులు కూడా వారే ఏర్పాటు చేసి కనీలు పాతి.అట్టి ప్రభుత్వ భూమిని విక్రయాలు చేసిన వ్యక్తి భూమిని కౌలుకిచ్చి కౌలు రైతుతో పట్టాదారుని కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేయడం రాత్రి వేళలో ఇంటి మీదికి వెళ్లి బెదిరింపులకు పాల్పడడం ఆత్మకూర్ పోలీస్ స్టేషన్లో పలుమార్లు దరఖాస్తు ఇచ్చిన విక్రయాలు చేసిన వ్యక్తిని కౌలు రైతు వల్ల మా కుటుంబానికి ప్రాణం భయం ఉందని బాధితుల కుటుంబం. పలుమార్లు ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో దరఖాస్తులు పెడుతున్నప్పటికీ. స్థానిక పోలీసులు పట్టించుకోలేదని. బాధితుల కుటుంబం తెలిపింది . ఈ విషయంపై హనుమకొండ జిల్లా కలెక్టర్. వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడవలసి ఉంది.

ముధోల్ బీఆర్ఎస్లో వర్గపోరు.!

- నాలుగు వర్గాలుగా విడిపోయిన గులాబీ నేతలు
- నేతల మధ్య నలు గుతున్న గులాబీ దండు
- నాయకత్వ లోపంతో దిక్కుతోచని స్థితిలో క్యాడర్
- రైతు గర్జన సభ వేళ బయటపడుతున్న విభేదాలు
- ఎవరి ఆధ్వర్యంలో సభకు వెళ్లాలో తెలియక కార్యకర్తల్లో అయోమయం
- వర్గపోరుకు కేటీఆర్ చెక్ పెడతారా?
- ఉమ్మడి నాయకత్వంపై గులాబీ శ్రేణుల ఆశలు



ప్రజా వాయిస్,నిర్మల్:ముధోల్ నియోజకవర్గ బీఆర్ఎస్లో అంతర్గత విభేదాలు బహిర్గతమవు తున్నాయి. పార్టీ నాయకుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు కార్యకర్తలకు తలనొప్పిగా మారింది. కిరణ్ కొమురెవర్, రమాదేవి, విలాస్ గాదేవర్, లోలం శ్యాంసుందర్ నేతృత్వంలో నాలుగు వర్గాలు కొనసాగుతున్నాయనే చర్చ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. దీంతో ఎవరిని అనుస రించాలో తెలియక గ్రామస్థాయి కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.నవంబరు 11న నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రైతు గర్జన సభకు పార్టీ శ్రేణులను సమీకరించా ల్సిన తరుణంలో ఈ విభేదాలు తెరపైకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సభకు ఎవరిని సంప్రదించాలి? ఎవరి ఆధ్వర్యంలో జనసమీకరణ చేపట్టాలి? అనే విషయంలో స్పష్టత కొరవడినట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, రైతాంగ సమస్యలపై పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. రైతులకు పెట్టుబడి సాయం, పత్తి, సోయాబీన్ పంటలకు గిట్టుబాటు ధర వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయా ల్సిన సమయంలో నియోజకవర్గ నేతలు అంతర్గత రాజకీయాలకే ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా పార్టీ కోసం పనిచే స్తున్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధిష్ఠానం దృష్టి సారించేనా.?

ముధోల్లో పార్టీని బలోపేతం చేయాలంటే నాయకుల మధ్య సమన్వయం అవసరమని కార్య కర్తలు భావిస్తున్నారు. వర్గ విభేదాలకు అడ్డుకట్ట వేసి ఉమ్మడి నాయకత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేదంటే క్యాడర్ నిరుత్సాహానికి గురయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవు తోంది. ఈ నేపథ్యంలో రైతు గర్జన సభకు హాజ రుకానున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎలాంటి దిశానిర్దేశం చేస్తారన్నది ఆసక్తి కరంగా మారింది. ముధోల్ పార్టీ నేతలను ఏక తాటిపైకి తీసుకొచ్చి కార్యకర్తలకు భరోసా ఇస్తారా అన్నది వేచి చూడాలి.



విద్యార్థుల భద్రత గాలికి.. శిథిల భవనంలో చదువులు.!

- కూలేందుకు సిద్ధంగా కేసారం పాఠశాల భవనం
- పెచ్చులూడుతున్న గోడలు.. బీటలు వారిన పైకప్పు
- ఫిర్యాదులు చేసినా స్పందించని సంబంధిత అధికారులు
- చిన్నారుల ప్రాణాలకు ముప్పు.. ప్రమాదం జరిగాకే మేల్కొంటారా.?

ప్రజావాయిస్,మోమిన్‌పేట్:విద్యార్థుల భద్రత గాలిలో దీపంలా మారింది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం కేసారం గ్రామంలోని పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. గోడలు పెచ్చులూడుతుండగా.. పైకప్పు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ భవనంలో విద్యార్థులు చదువుకోవాల్సి రావడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం

పాఠశాల భవనం దుస్థితిని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. చిన్నారుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేయడం కంటే ముందే స్పందించాల్సిన బాధ్యత లేదా అని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి శిథిల భవనాన్ని తొలగించి, విద్యార్థులకు సురక్షితమైన తరగతి గదులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అరక ఇన్ఫ్రా ఆగడాలకు అంతే లేదా?

- 100 ఫీట్ల రహదారిపై పైప్ లైన్ .. నిబంధనలు బేఖాతర్!
- వృక్షాల తొలగింపు నుంచి భారీ నిర్మాణాల వరకు
- కనిపిస్తున్న ఉల్లంఘనలు.. స్పందించని అధికారులు!
- ప్రజా ప్రయోజనాలా? వెంచర్ ప్రయోజనాలా?
- గ్రామస్తుల ప్రశ్నలకు సమాధానం చెప్పేదెవరు?



ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలతో వికారాబాద్ మండలం సిద్దులూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని అరక ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ భారీ వెంచర్ మరోసారి చర్చనీయాంశంగా మారింది. వెంచర్ నిర్మాణంలో భాగంగా 100 ఫీట్ల రోడ్డుపై భారీ సిమెంట్ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై పైప్ లైన్.. ప్రజలకు ఇబ్బందులు?

ప్రజల రాకపోకలకు ఉద్దేశించిన 100 ఫీట్ల రోడ్డుపై పైప్‌లైన్ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలను నరికివేశారని, ఇప్పుడు రహదారిపైనే నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాలు భవిష్యత్తులో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

అధికారుల మౌనం ఎందుకు?

బహిరంగంగా కనిపిస్తున్న నిర్మాణాలపై సంబంధిత శాఖల అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిశీలన లేకపోవడం, చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

చర్యలు తీసుకోవాలని డిమాండ్

జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి 100 ఫీట్ల రోడ్డుపై జరుగుతున్న పనులను పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రహదారి హద్దులు, నిర్మాణ అనుమతులు, పైప్‌లైన్ ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలను పరిశీలించి అక్రమాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ప్రయోజనాల కంటే ప్రైవేట్ వెంచర్ల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారా? అన్న ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఆర్ అండ్ బి అధికారుల వివరణ ఇలా..

భవిష్యత్తు కాలంలో 100 ఫీట్ల రోడ్డుగా మారనున్న ప్రధాన రోడ్డులో అరక ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ వారు నీటి ప్రవాహం కొరకు ఇలాంటి అనుమతులు లేకుండా పైప్ లైన్ నిర్మాణం చేపట్టిన విషయం తమ దృష్టికి రావడం జరిగిందని, వచ్చిన వెంటనే సంబంధిత నిర్వాహకులకు అట్టి పైప్ లైన్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.



ఆరుగాలం శ్రమ.. కోతుల పాలు.!

- రెండు ఎకరాల్లో పత్తి, మిరప పంటల ధ్వంసం
- వానరాల బీభత్సంతో కుదేలైన రైతు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి రైతు వేడుకోలు



ప్రజా వాయిస్, గార్ల: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే వేళ కోతుల గుంపులు బీభత్సం సృష్టించాయి. పత్తి, మిరప పంటలను ధ్వంసం చేసి రైతుకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. వానరాల దాడితో రెండు ఎకరాల్లో సాగు చేసిన పంటలు తీవ్రంగా దెబ్బతినడంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ముల్కనూర్ గ్రామంలో చోటుచేసుకుంది.ముల్కనూర్ గ్రామానికి చెందిన ఓ రైతు తనకున్న రెండు ఎకరాల భూమిలో పత్తి, మిరప పంటలు సాగు చేశాడు. పెట్టుబడులు పెట్టి, రెక్కలు ముక్కలు చేసుకుని పంటలను పెంచగా కోతుల గుంపులు ఒక్కసారిగా పొలాలపై దాడి చేసి మొక్కలను విరిచివేస్తూ తీవ్రంగా నష్టపరిచాయి. కళ్లముందే పంటలు నాశనం కావడంతో రైతు కన్నీరుమున్నీరవుతున్నాడు.ఇప్పటికే పెట్టుబడులు, సాగు ఖర్చులతో సతమతమవుతున్న రైతులకు కోతుల బెడద మరింత భారంగా మారింది. పంటలను కాపాడుకునేందుకు నిత్యం పొలాల వద్ద కాపలా కాస్తున్నా వానరాల దాడులను అడ్డుకోలేని పరిస్థితి నెలకొంది. రెండు ఎకరాల పంట నష్టంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న బాధిత రైతు ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని వేడుకుంటున్నాడు. అధికారులు క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి ఆదుకోవాలని, గ్రామంలో కోతుల బెడద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతున్నాడు.

రైతుల ఆవేదన.. ఎమ్మెల్యే స్పందన

- మిల్లర్లతో కీలక భేటీ
- ధాన్యం ధరపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చర్చలు
- క్వింటాల్ కు రూ.3,500 తగ్గకుండా కొనుగోలుకు మిల్లర్ల అంగీకారం
- నాణ్యతను బట్టి మరింత ధర చెల్లించేందుకు హామీ.. రైతులకు ఊరట



ప్రజా వాయిస్ – మిర్యాలగూడ: రైతుల ఆవేదన.. ధాన్యం ధరలపై ఆందోళన.. ఈ నేపథ్యంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రంగంలోకి దిగారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రైస్ మిల్లర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కీలక నిర్ణయం తీసుకునేలా చొరవ చూపారు.

గత రెండు రోజులుగా ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ రైతులు ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ మేరకు మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో, సంబంధిత అధికారులతో పాటు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని, వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా చూడాలని మిల్లర్లకు సూచించారు.

ముఖ్యంగా జేఎస్ఆర్, చింట్లు రకం ధాన్యాన్ని క్వింటాల్‌కు కనీసం రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఏ రైస్ మిల్లర్ కూడా ఈ ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. ధాన్యం నాణ్యతను బట్టి మరింత ధర చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మిల్లర్ల కీలక ప్రకటన..

ఎమ్మెల్యేతో సమావేశం అనంతరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించి రైతులకు కీలక హామీ ఇచ్చారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి రైస్ మిల్లులో ధాన్యం క్వింటాల్‌కు రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేస్తామని ప్రకటించారు. ధాన్యం నాణ్యత బాగుంటే రూ.3,500 కంటే ఎక్కువ ధర కూడా చెల్లిస్తామని స్పష్టం చేశారు.

కొనుగోళ్లపై అధికారుల పర్యవేక్షణ.

.★ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కొనుగోళ్లు పారదర్శకంగా, సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.రైతుల ఆవేదనను గుర్తించి ఎమ్మెల్యే స్వయంగా రంగంలోకి దిగి రైస్ మిల్లర్లతో చర్చలు జరపడం, క్వింటాల్‌కు రూ.3,500 కనీస ధరకు మిల్లర్లు అంగీకరించడం మిర్యాలగూడలో చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్ణయంతో ధాన్యం ధరల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఊరట లభించింది.



కరువు కాటకాలతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు

- ఎకరానికి రూ. 30 వేల పంట నష్టపరిహారం చెల్లించాలి
- జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన సీపీఐ పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏశమేని గణేష్, ఎండీ ముక్రమ్ లు



ప్రజా వాయిస్, జగిత్యాల:తెలంగాణ రాష్ట్రంలో కరువు పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ కౌన్సిల్ మెంబర్, జగిత్యాల జిల్లా సిపిఐ పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ అధ్యక్షుడు ఏశమేని గణేష్‌లు డిమాండ్ చేశారు.పంటలు సాగు చేసేందుకు రైతులు పెట్టుబడుల రూపంలో వేలాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, వర్షాభావ పరిస్థితులు, కరువు కారణంగా పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే గుర్తించి ఎకరానికి రూ. 30 వేల చొప్పున పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టి, వ్యవసాయ రంగాన్ని ఆదుకునేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. పంటల బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి, నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి బాధిత రైతులకు తక్షణ సహాయం అందించాలని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ నాయకులు, సీపీఐ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని జగిత్యాల జిల్లా సిపిఐ పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఏశమేని గణేష్‌లు స్పష్టం చేశారు. సీపీఐ నాయకులు సుతారి రాములు, సహాయ కార్యదర్శులు ఇరుగురాల భూమేష్, మునుగురి హనుమంతు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎండీ ముక్రమ్, జగిత్యాల జిల్లా మున్సిపల్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ ఉస్మాన్, సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ అక్రమ్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామిల్ల రాంబాబు, గంగాసర్సయ్య, అందే వంశీ, మాడిశెట్టి కిరణ్, వెన్న సురేష్, రాధక్క తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మత్స్య శాఖ జిల్లా అధికారి తీరు..?

- నిబంధనలకు విరుద్ధంగా సొసైటీ సభ్యత్వాలు
- లేని భూమిని రికార్డుల్లో ఎక్కువగా నమోదు
- ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం



ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటి అమలు కోసం మత్స్య సొసైటీ ల ద్వారా సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు, సొసైటీ సభ్యులను ఏర్పాటు చేశారు. కాగా మత్స్యకారుల అభివృద్ధి ,పర్యవేక్షణ చేయాల్సిన జిల్లా మత్స శాఖ అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సంఘటన హనుమకొండ జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో చోటు చేసుకుంది....మత్స్య శాఖ జిల్లా అధికారి వ్యవహరిస్తున్న తీరుపై మత్స్య కారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం దామెర మండల కేంద్రం లోని రికార్డుల్లో లేని భూమిని సృష్టించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నూతన సభ్యత్వాలు ఇప్పిస్తానని దళారుల ద్వారా డబ్బులు వసూలు చేసి అనర్హులకు సభ్యత్వాలు ఇప్పించిన ఘనత జిల్లా మత్స్యశాఖ అధికారులకె చెల్లుతూందనడములో సందేహం లేదు.అర్హులైన మత్స్యకారులు సంబంధిత జిల్లా అధికారికి సంవత్సర కాలం పాటు పిర్యాదు చేస్తున్న ప్పటికి అంతా నా ఇష్టం మీ దిక్కున్న చోట చెప్పుకోమ్మనే విధంగా జిల్లా అధికారి తీరు ఉన్నట్లు మత్స్య కారులు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారు...దామెర సొసైటీ పరిధిలో చెరువులు, కుంటల విస్తీర్ణం ఉన్న దాని కంటే ఎక్కువగా విస్తీర్ణం ఉన్నట్లు తప్పుడు రికార్డులు సృష్టించి దళారి వ్యవస్థని ప్రోత్సహించి డబ్బులు దండుకుంటు ప్రభుత్వ ఆశయాన్ని నీరుగారుస్తున్న జిల్లా మత్స శాఖ అధికారులపై మత్స కారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల నడుస్తున్న సమయంలో చెట్ల కింద ఏర్పాటు చేసి అనర్హుల వద్ద డబ్బులు తీసుకొని ఎన్నికలు నిర్వహించకుండానే అధికారులు వెళ్లిపోయిన సంఘటన లేక పోలేదు? దీన్ని బట్టే గత ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల అండ దండలు .అధికారుల లాలూచీ తనం తో అనర్హులకు సహకరించారనే ఆరోపణలు లేక పోలేదు .ఏది ఏమైనప్పటికీ మత్స కారుల అభివృద్ధి కి కృషి చేయాల్సిన అధీకారులు మామూళ్ల కు అలవాటు పడి అర్హులైన మత్స్య కారులకు అన్యాయం చేయడం నూతన ప్రభుత్వం జిల్లా కలెక్టర్ తమకు న్యాయం జరిగేలా చూడాలని మత్స కారులు కోరుకుంటున్నారు..

లోన్ యాప్‌ల వేధింపులకు కానిస్టేబుల్ బలి.!

- మార్ఫింగ్ చేసిన నగ్న ఫొటోలతో బ్లాక్ మెయిల్
- బంధువులకు చిత్రాలు పంపి తీవ్ర వేధింపులు
- క్రికెట్ బెట్టింగ్ లో నష్టాలు.. యాప్ ల ద్వారా అప్పులు



ప్రజా వాయిస్,చంపాపేట్ :ఆన్‌లైన్ లోన్ యాప్‌ల వేధింపులు మరో నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. అప్పులు తిరిగి చెల్లించాలంటూ బెదిరింపులకు దిగడమే కాకుండా.. మార్ఫింగ్ చేసిన నగ్న ఫొటోలను బంధువులకు పంపి వేధించడంతో ఓ పోలీసు కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం హర్షగూడలో ఈ ఘటన చోటుచేసుకుంది.8వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ముడావత్ శ్రీను (31) తన నివాసంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గుర్తించి కాపాడేందుకు ప్రయత్నించినా అప్పటికే మృతి చెందాడు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు నష్టపోయిన శ్రీను.. పలు లోన్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకున్నట్లు సమాచారం. రుణాలు చెల్లించలేకపోవడంతో యాప్ నిర్వాహకులు బెదిరింపులకు పాల్పడటంతో పాటు, మార్ఫింగ్ చేసిన నగ్న ఫొటోలను బంధువులకు పంపి వేధించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏళ్లుగా వెక్కిరిస్తున్న అసంపూర్తి ఇళ్లు

- ఇకనైనా పేదల కల నెరవేరేనా?
- అసంపూర్తి డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై కలెక్టర్ ఫోకస్
- లబ్ధిదారుల ఎంపికకు ఆదేశాలు!
- డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరగాలి
- ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.
- ఐదు గ్రామాల్లో 316 ఇళ్ల పరిశీలన
- ఇందిరమ్మ లబ్ధిదారులకు కేటాయించే దిశగా ముమ్మర చర్యలు!





ప్రజా వాయిస్ ఖమ్మం:ఏళ్ల తరబడి నిరుపేదల సొంతింటి కలను వెక్కిరిస్తున్న అసంపూర్తి డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు ఎట్టకేలకు మోక్షం కలగనుందా? గత ప్రభుత్వ నిధులతో నిర్మాణాలు చేపట్టినా.. వివిధ కారణాలతో మధ్యలోనే నిలిచిపోయి, కాలక్రమేణా నిరుపయోగంగా మారిన ఈ ఇళ్లు ఇప్పటికీ పేదల ఎదురుచూపులకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఒకవైపు సొంత గూడు కోసం నిరుపేదలు ఏళ్లుగా ఎదురు చూస్తుంటే.. మరోవైపు ప్రభుత్వ వ్యయంతో చేపట్టిన నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలిపోవడం పాలనా వ్యవస్థలోని నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇలా అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్లను వినియోగంలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ప్రస్తుత నిర్మాణ స్థితిలోనే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించి, వారి అంగీకారంతో మిగిలిన పనులు పూర్తి చేసుకునే అవకాశం కల్పించాలని నిర్ణయించడం ద్వారా ఒకేసారి రెండు సమస్యలకు పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామంలో 30, సింగిరెడ్డి పాలెం గ్రామంలో 48, శంకరగిరి తండా గ్రామంలో 30, కూసుమంచి మండలం మల్లెపల్లి గ్రామంలో 16, ఖమ్మం అర్బన్ మండలం దంసలాపురంలో 192 చొప్పున సుమారు 316 అసంపూర్తిగా ఉన్న ఇళ్లను కలెక్టర్ పరిశీలించి, వాటి నిర్మాణ తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అంతేకాకుండా ఇళ్ల సముదాయాల్లో విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించడం ఈ ప్రక్రియకు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలు, అధికారుల ఆదేశాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా కేటాయింపులు, మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణాల పూర్తికి దారితీస్తాయా? ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురు చూస్తున్న నిరుపేద కుటుంబాలకు ఈ ఇళ్లు ఎప్పటికి అందుబాటులోకి వస్తాయి? అన్నదే ఇప్పుడు అసలైన ప్రశ్న. కలెక్టర్ చొరవతో మొదలైన ఈ కదలిక చివరకు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందో లేదో వేచి చూడాలి.

ఈ క్షేత్రస్థాయి పర్యటనలో హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, తహశీల్దార్లు రాంప్రసాద్, సైదులు,నేలకొండపల్లి ఎంపిడిఓ యం. యర్రయ్య విజయేందర్ రెడ్డి, జయచంద్ర, హౌజింగ్ డీఈ కే. జగ్రామ్, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. మొత్తానికి, అధికారుల పర్యవేక్షణతో నిలిచిపోయిన ఈ ఇళ్లకు మోక్షం కలుగుతుండటంతో, తమ సొంతింటి కల త్వరలోనే నెరవేరుతుందన్న ఆశ లబ్ధిదారుల్లో గట్టిగా వ్యక్తమవుతోంది.

ప్రజా సమస్యలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు.!

- వేల కోట్లు ఖర్చు..
- ప్రజా సమస్యలకు పరిష్కారం ఏదీ?
- నూతన సమాజ మార్పునకు కమ్యూనిజమే మార్గం: గౌని ఐలయ్య



ప్రజా వాయిస్,గూడూరు: నూతన సమాజ మార్పునకు కమ్యూనిజమే సరైన మార్గమని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. మచ్చర్ల గ్రామంలో కామ్రేడ్ పెనక వెంకన్న (విక్రమ్), చిన్నం కోటి, రాసూరి యాకన్న స్మారక బహిరంగ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా గౌని ఐలయ్య, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను అప్పగిస్తూ కార్మిక, కర్షక, విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణకు వేల కోట్లు ఖర్చు చేస్తూ విద్య, వైద్యం వంటి ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.సభకు ముందు గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించి అమరవీరుల స్తూపాల వద్ద నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గూడూరు మండల కార్యదర్శి గజ్జి లింగయ్య, డివిజన్ కార్యదర్శి సూర్యం, జిల్లా నాయకులు పుల్లన్న, శ్రీశైలం, హెచ్. లింగ్య, మధు, రాకేష్, కొట్టం అచ్చన్న, అద్దూరి వెంకన్న, ఒర్రె వెంకన్న, కాడబోయిన నరసయ్య, వజ్రయ్య, ఏల ఉపేందర్, చిన్నం లక్ష్మి, అనిత, తాళ్లపెల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర శిల్పికి.. చిత్ర నివాళి!

ప్రజాకవి అందెశ్రీ ప్రథమ వర్ధంతి వేళ అరుదైన కళాత్మక నివాళి

- తెలంగాణ గొంతుకకు తన చిత్రంతో ప్రాణం పోసిన ఆర్టిస్ట్ మందుగుల శ్రీనివాస్



జావాయిస్/సంస్థాన్ నారాయణపురం ప్రజాకవి అందెశ్రీ జ్ఞాపకాలు నేటికీ గుర్తు చేసుకుంటూ ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన కళాకారుడు మందుగుల శ్రీనివాస్ తన కుంచెతో కవి అందెశ్రీ చిత్రపటాన్ని గీసి అక్షర శిల్పికి చిత్ర నివాళి అర్పించారు. అచ్చం అందెశ్రీ రూపాన్ని కళ్లముందు ఉంచినట్లున్న ఈ చిత్రాన్ని చూసి స్థానిక ప్రజలు, ప్రము ఖులు హర్షం వ్యక్తం చేశారు. కళ ద్వారా కవికి సముచిత గౌరవం అందించిన శ్రీనివాస్‌ను అభినందించారు. తెలంగాణ కళాకారులు,ఉద్యమ కారుల చిత్రాలతో ఎంతో చక్కటి పెన్సిల్ తో అచ్చం చిత్రం ఊడిపడేలా తన కలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న వీరికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి కళాకారులను వెలికి తీసి ఉపాధి కల్పిం చే విధంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు



మృతుడి కుటుంబానికి పోలీస్ శాఖ అండ.!

- రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ రామస్వామి మృతి
- కుటుంబానికి రూ.5 లక్షల వ్యక్తిగత బీమా చెక్కు అందజేత
- పోలీస్ కుటుంబాల సంక్షేమానికి శాఖ కట్టుబడి ఉంది
- సిబ్బంది ప్రాణరక్షణకు రోడ్డు భద్రతా జాగ్రత్తలు తప్పనిసరి: ఎస్పీ పాటిల్

ప్రజా వాయిస్, నాగర్‌కర్నూల్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ రామస్వామి కుటుంబానికి రూ.5 లక్షల వ్యక్తిగత బీమా చెక్కును మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు.పోలీస్ భద్రత వెల్ఫేర్ అసోసియేషన్ మంజూరు చేసిన బీమా చెక్కును ఎస్పీ స్వయంగా మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కానిస్టేబుల్ రామస్వామి పోలీస్ శాఖలో అంకితభావంతో సేవలందించారని, ఆయన మరణం శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. అకాల మరణం చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలను ఆదుకోవడం శాఖ బాధ్యతని స్పష్టం చేశారు.బీమా సదుపాయంతో పాటు ప్రభుత్వపరంగా అందాల్సిన అన్ని ప్రయోజనాలను కుటుంబ సభ్యులకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుటుంబ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ, ఏ అవసరం వచ్చినా పోలీస్ శాఖను సంప్రదించాలని సూచించారు.పోలీసులు విధి నిర్వహణలోనే కాకుండా వ్యక్తిగత ప్రయాణాల్లోనూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, ప్రాణాలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఓ కృష్ణయ్య, ఆర్ఎస్ఐ గౌస్ పాషా, పోలీస్ కోఆర్డినేటర్ గోలి శ్రీనివాస్, ఇతర పోలీస్ సిబ్బంది, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చిట్టిల వ్యాపారులుగా ప్రభుత్వ ఉద్యోగులు..!

- రియాల్టర్ గా మారిన వైనం - చదువు చెప్పేది
- శూన్యం భూ వ్యాపారిపై దృష్టి
- పట్టించుకుని జిల్లా విద్యాశాఖ అధికారులు

ప్రజా వాయిస్ / దుబ్బాక:దుబ్బాక గౌరవప్రదమైన ప్రధానమైన వృత్తి ఉపాధ్యాయుగా ఉండి.. అంతే కాకుండా భూ దందాలకు, సెటిల్మెన్లాగా మారి పేదల నోట్లో మన్ను పోస్తున్నారు. అంతేకాకుండా లక్ష రూపాయలు జీతం తీసుకుంటూ చిట్టిల పేరుతో డబ్బుల పేరుతో ఆశ చూపి భూములను బల్వంతంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్న వైనం. కొంతమంది ఉపాధ్యాయులు కూడా ఇది బాహ్యంలో కొనసాగుతూ ఇష్ట రాజ్యాంగ పేదలను కడుపు కొడుతున్నారు. విద్యార్థులకు భవిష్యత్తు చూపించాల్సిన మాస్టారు పేకాట రాయుడు గా మారి పేద ప్రజలకు మోసం చేస్తున్నారు. దుబ్బాక ప్రాంతానికి చెందిన ఓ మహిళకు భూమిని రోడ్డు పక్కన చూపించి దొంగ రిజిస్ట్రేషన్ చేపించినట్లు తెలిసింది. తన పేరు చెప్తే చాలు దుబ్బాకలో తప్పు త ఎవరు మెచ్చరు..? ఆ ఉపాధ్యాయుడు ఆయనకు పెట్టింది పేరు. జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వివరిస్తున్నారు. ఆ ఉపాధ్యాయుడు లావాదేవీల పై విచారణ జరిపి చర్య తీసుకోవాలని పలువురు అంటున్నారు.



తొగుట మండలం తుక్కాపూర్‌లో భారీ అగ్నిప్రమాదం

- నిరుపేద కుటుంబానికి రూ.2 లక్షల ఆస్తి నష్టం!

ప్రజా వాయిస్ – దుబ్బాక / తొగుట: సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో తీవ్ర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చిక్కుడు నారాయణ ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న నగదు, విలువైన వస్తువులు సహా సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం.కష్టపడి సంపాదించుకున్న ఆస్తి కళ్లముందే అగ్నికి ఆహుతి కావడంతో బాధిత కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. నిరుపేద కుటుంబానికి ఒక్కసారిగా ఇలాంటి విపత్తు ఎదురవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది.ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే గ్రామానికి చేరుకుని అగ్నిప్రమాదంలో జరిగిన ఆస్తి నష్టాన్ని అంచనా వేసి, బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇల్లు కోల్పోయిన కుటుంబానికి పునరావాసం కల్పించి ప్రభుత్వం అండగా నిలవాలని కోరుతున్నారు.కష్టపడి జీవనం సాగించే నిరుపేద కుటుంబానికి జరిగిన ఈ నష్టం పట్ల గ్రామస్థులు విచారం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరుతున్నారు.



ప్రొఫెసర్‌కే రక్షణ లేకపోతే...

1,500 మంది విద్యార్థినుల భద్రత మాటేమిటి.?

- వీసీపై ఫిర్యాదు చేసి 17 రోజులైనా ఎఫ్ ఐఆర్ నమోదు కాలేదు..?
- విచారణ పూర్తయ్యే వరకు అల్దాస్ జానయ్యను ఉపకులపతి పదవి నుంచి తప్పించాలి
- సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్,సునీత లక్ష్మారెడ్డి డిమాండ్

జావాయిస్||రాజేంద్రనగర్: విశ్వవిద్యాలయంలో మహిళా ప్రొఫెసర్‌కే రక్షణ లేకపోతే అక్కడ చదువుకుంటున్న 1,500 మంది విద్యార్థినుల భద్రత పరిస్థితి ఏమిటని బీఆర్ఎస్ మహిళా నేతలు ప్రశ్నించారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ముసిని తేజశ్రీపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఉపకులపతి అల్దాస్ జానయ్యపై వచ్చిన ఆరోపణలు వర్సిటీ ప్రాంగణంలో చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు బాధితురాలికి సంఘీభావం తెలిపారు. మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్,మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తేజశ్రీని పరామర్శించి ఆమెకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు.విద్యాబుద్ధులు నేర్పే అధ్యాపకురాలికే రక్షణ లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.హోంశాఖ విద్యాశాఖలు తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల భద్రతపై ఇప్పటివరకు ఒక్క సమీక్ష అయినా నిర్వహించారా అని నిలదీశారు.వీసీపై లైంగిక వేధింపుల ఆరోపణలతో ఫిర్యాదు చేసి 17 రోజులు గడుస్తున్నా ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులతో ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేసి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, విచారణ పూర్తయ్యే వరకు అల్దాస్ జానయ్యను ఉపకులపతి హోదా నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.బాధితురాలికి న్యాయం చేయడంతో పాటు విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, చదువుకుంటున్న విద్యార్థినులకు భద్రత కల్పించాలని కోరారు.ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితురాలికి న్యాయం చేయకపోతే బీఆర్ఎస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.మరో వైపు సంఘీభావం తెలిపేందుకు వర్సిటీ ప్రాంగణానికి చేరుకున్న





రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ళ కార్తీక్ రెడ్డి,నేతలు కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు..

రూ.50 వేల లంచం.. ఏసీబీకి చిక్కిన ఇన్‌ఛార్జ్ కమిషనర్.!

- కాంట్రాక్టర్ బిల్లు మంజూరుకు లంచం డిమాండ్
- నగదు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- భైంసా మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ జాదవ్ సంతోష్ అరెస్ట్
- మంచిర్యాల చౌరస్తాలోని కుబేర హోటల్ సమీపంలో దాడి



ప్రజా వాయిస్,నిర్మల్ జిల్లా ప్రతినిధి: కాంట్రాక్టర్ బిల్లు మంజూరు చేయాలంటే లంచం ఇవ్వాల్సిందే..రూ.50 వేల లంచం తీసుకుంటూ భైంసా మున్సిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్, డిప్యూటీ ఇంజనీర్ జాదవ్ సంతోష్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మంగళవారం సాయంత్రం నిర్మల్ పట్టణంలోని మంచిర్యాల చౌరస్తా సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది..వివరాల్లోకి వెళ్తే.. ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లులు మంజూరు చేసేందుకు జాదవ్ సంతోష్ రూ.50 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో పక్కా వ్యూహంతో రంగంలోకి దిగిన ఏసీబీ బృందం.. మంగళవారం సాయంత్రం కుబేర హోటల్ సమీపంలో కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేల నగదు తీసుకుంటుండగా జాదవ్ సంతోష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. అనంతరం రసాయన పరీక్షలు నిర్వహించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.మున్సిపల్ వర్గాల్లో కలకలంఇన్‌ఛార్జ్ కమిషనర్ స్థాయి అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం భైంసా మున్సిపల్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ వ్యవహారంలో మరెవరి పాత్ర అయినా ఉందా, గతంలోనూ ఇలాంటి లావాదేవీలు జరిగాయా, అనే కోణాల్లో ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, తదుపరి చర్యలు తెలియాల్సి ఉంది.

గుంతల రోడ్డుపై గుండెల్లో గుబులు.!

- చిలుకూరు,రామాపురం రహదారి అధ్వానం
- 3.5 కిలోమీటర్ల ప్రయాణం.. అడుగడుగునా ప్రమాదాలే!
- భారీ వాహనాలతో కుంగిన రోడ్డు.. వర్షం పడితే గుంతలే చెరువులు
- అంబులెన్సులు సైతం వెళ్లలేని దుస్థితి.. పట్టించుకోని అధికారులు
- శాంక్షన్ లిస్టులోకి వస్తేనే పనులు చేపడతాం: పంచాయతీరాజ్ డీఈ

ప్రజా వాయిస్, చిలుకూరు:చిలుకూరు,రామాపురం ప్రధాన రహదారి ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. సుమారు 3.5 కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా గుంతలమయమై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. ఏళ్ల తరబడి మరమ్మతులు లేక బీటీ రోడ్డు ఆనవాళ్లు కోల్పోయింది. నిత్యం వందలాది వాహనాలు, పాఠశాల విద్యార్థులు, గ్రామీణ ప్రజలు ఈ మార్గంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. రోడ్డు దుస్థితిపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు.

భారీ లారీలతో రోడ్డు ఖతం

ఈ మార్గంలోని ఓ కంపెనీకి చెందిన పెట్రోల్ బంకుకు భారీ లారీలు, ఇంధన ట్యాంకర్లు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. అధిక బరువున్న వాహనాల తాకిడికి రహదారి కుంగిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బీటీ పొర పూర్తిగా ఊడిపోయి కంకర తేలింది. అడుగడుగునా ఏర్పడిన భారీ గుంతలు వాహనదారులకు ప్రాణసంకటంగా మారాయి.

వర్షం పడితే చెరువులే

చిన్నపాటి వర్షానికే రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు చేరుతోంది. గుంతల లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. టైర్లు పంక్చర్లు కావడం, వాహనాలు జారిపడటం పరిపాటిగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు.

మండల కేంద్రానికి వెళ్లాలంటే చుట్టూ తిరగాల్సిందే

రహదారి అధ్వానంగా ఉండటంతో ఆటో డ్రైవర్లు ఈ మార్గంలో రావడానికి వెనుకాడుతున్నారు. దీంతో మండల కేంద్రానికి వెళ్లే గ్రామీణులు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్సులు సైతం సకాలంలో చేరలేని పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హామీలే తప్ప.. అభివృద్ధి ఏదీ.?

ఎన్నికల సమయంలో రోడ్డు నిర్మాణం చేపడతామని హామీలు ఇచ్చే ప్రజాప్రతినిధులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని మండిపడుతున్నారు. తక్షణమే నిధులు మంజూరు చేసి నూతన రహదారి నిర్మించాలని, లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

ప్రజల ప్రశ్న ఒక్కటే.. రోడ్డు ఎప్పుడు వేస్తారు.?

ప్రజలు ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నా ప్రతిపాదనల దశ దాటక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చిలుకూరు నుంచి రామాపురం వరకు నూతన రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

శాంక్షన్ వస్తేనే పనులు

చిలుకూరు,రామాపురం రహదారి ఇంకా శాంక్షన్ జాబితాలోకి రాలేదని, ప్రతిపాదనలు పంపించామని, శాంక్షన్ లిస్టులోకి వచ్చిన తర్వాత పనులు చేపడతామని పేర్కొన్నారు..

పంచాయతీరాజ్ డీఈ



భూమి కొన్నది ఒకరు.. పట్టా చేసుకున్నది మరొకరు

- భార్య పేరుతో కొనుగోలు చేసిన ఎకరా 15 గుంటల భూమిపై వివాదం
- 2010లో ఇతరుల పేర్లపై అక్రమంగా పట్టా చేశారంటూ బాధితుడి ఆరోపణ



ప్రజా వాయిస్, ఎల్కతుర్తి:భూమి కొనుగోలు చేసి హక్కులు పొందినట్లు భావించిన బాధితుడికి మరో చిక్కు ఎదురైంది. భార్య పేరుతో కొనుగోలు చేసిన భూమిని ఇతరులు అక్రమంగా పట్టా చేసుకున్నారంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని భావుపేట శివారు సర్వే నంబర్ 115లో చోటుచేసుకుంది.మంగళవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోతరబోయిన కుమారస్వామి మాట్లాడుతూ.. దండేపల్లి గ్రామానికి చెందిన భూ యజమాని పొలాటి సీతారామారావు వంశస్థుల నుంచి భావుపేట గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు కలిపి 6 ఎకరాల 17 గుంటల భూమిని కొనుగోలు చేశారని తెలిపారు. వారి నుంచి 2009లో తన భార్య పోతరబోయిన గట్టమ్మ పేరుతో ఎకరా 15 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు వివరించారు.అయితే అదే గ్రామానికి చెందిన పోతరబోయిన శ్రీధర్, పోతరబోయిన కనకలక్ష్మి, పోతరబోయిన రజనీకాంత్‌లు 2010లో సదరు భూమిని అక్రమంగా తమ పేర్లపై పట్టా చేసుకున్నారని ఆరోపించారు. తాము డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన భూమిని ఇతరులు తమ పేర్లపై ఎలా పట్టా చేసుకున్నారో అధికారులే తేల్చాలని కోరారు. సంబంధిత రెవెన్యూ అధికారులు విచారణ జరిపి అసలు హక్కుదారులకు న్యాయం చేయాలని కుమారస్వామి విజ్ఞప్తి చేశారు.



భీం భరత్‌కు గ్రామస్తుల ఆత్మీయ జన్మదిన వేడుకలు!

- అందుబాటులో లేకున్నా.. అభిమానంతో పుట్టిన గడ్డపై సంబరాలు
- నరెడ్లగూడలో బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసిన గ్రామస్తులు

నరెడ్లగూడ: చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేన భీం భరత్ జన్మదిన వేడుకలను ఆయన స్వగ్రామమైన నరెడ్లగూడలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. భీం భరత్ వేడుకలకు అందుబాటులో లేకపోయినప్పటికీ ఆయనపై తమకున్న అభిమానాన్ని, ఆత్మీయతను గ్రామస్తులు చాటుకున్నారు.ఆయన పుట్టిన గడ్డపై బాణాసంచా కాలుస్తూ పండుగ వాతావరణంలో జన్మదిన వేడుకలు జరిపారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. భీం భరత్‌పై తమకున్న ప్రేమాభిమానాలను ఈ వేడుకల ద్వారా చాటుకున్నారు. ఆయన అందుబాటులో లేకున్నా గ్రామస్తులు స్వచ్ఛందంగా ఇంతటి ఆత్మీయ వేడుకలు నిర్వహించడం గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



నాగార్జునసాగర్‌లో ఘనంగా కర్నాటి లింగారెడ్డి జన్మదిన వేడుకలు

- గజమాలతో ఘన సత్కారం
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, ప్రజాప్రతినిధులు

నాగార్జునసాగర్, ప్రజా వాయిస్:నల్గొండ జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి జన్మదిన వేడుకలు నాగార్జునసాగర్‌లో ఘనంగా నిర్వహించారు. నాగార్జునసాగర్‌లోని ఆయన నివాసంలో అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్నాటి లింగారెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కర్నాటి లింగారెడ్డి ప్రజాజీవితంలో అందరితో సత్సంబంధాలు కొనసాగిస్తూ, రాజకీయంగా తనదైన గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, కొత్తలూరు సర్పంచ్ రావులపాటి రాంబాబు, ఉపసర్పంచ్ నులక సిద్ధార్థ రెడ్డి, హాలియా మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొట్టే రమేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ బాలేమియా, సయ్యద్ లతీఫ్, గోలి నాగార్జున, కట్టెబోయిన మల్లేష్ యాదవ్, కుంటి గొర్ల సైదులు యాదవ్, రావులపాటి వెంకన్న, బీరపువ్వు సంతోష్, కుంటి గొర్ల పరమేష్ యాదవ్, సయ్యద్ ఖాసిం, షేక్ షరీఫ్, కుంటి గొర్ల నగేష్ యాదవ్ తదితరులు పాల్గొని కర్నాటి లింగారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా ప్రొఫెసర్‌కు అండగా తెలంగాణ రక్షణ సేన

- సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన మహిళా నాయకుల అరెస్టుపై ఆగ్రహం
- వీసీని సస్పెండ్ చేసి, ఉన్నతస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేసిన తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పగడాల మనోజ



ప్రజావాయిస్||రాజేంద్రనగర్:ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మహిళా ప్రొఫెసర్ తేజశ్రీ కి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన మహిళా నాయకులు ఆమెకు సంఘీభావం తెలిపారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు పడాల మనోజ గౌడ్,రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ సర్వేష్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్య ఆధ్వర్యంలో నాయకులు విశ్వవిద్యాలయానికి వెళ్లారు.ఈ సందర్భంగా సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన మహిళా నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తెలంగాణ రక్షణ సేన నాయకులు తీవ్రంగా ఖండించారు.పోలీసుల చర్యలో హైదరాబాద్ మహిళా విభాగం జనరల్ సెక్రటరీ గీత గౌడ్ గాయపడ్డారని వారు తెలిపారు.అనంతరం పడాల మనోజ గౌడ్ మాట్లాడుతూ..మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం జరిగేలా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని స్పష్టం చేశారు.మహిళలకు అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించడం,బాధితులకు అండగా నిలబడటం తమ బాధ్యతని పేర్కొన్నారు. మహిళల ఆత్మగౌరవం, భద్రత విషయంలో రాజీపడబోమని,న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బోసగిరి ఇందిర,మేడ్చల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు అనుముల స్వప్న, ఇబ్రహీంపట్నం మహిళా అధ్యక్షురాలు మేడికొండ జయలక్ష్మి,ఉప్పల్ మహిళా అధ్యక్షురాలు సుధారెడ్డి, యాకుత్‌పుర మహిళా అధ్యక్షురాలు శారద, జూబ్లీహిల్స్ మహిళా అధ్యక్షురాలు మౌనిక, మల్కాజిగిరి మహిళా అధ్యక్షురాలు జోష్ణతో పాటు పలువురు మహిళా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో రూ.6 కోట్ల నిధుల వ్యయంపై దుమారం!

- శ్వేతపత్రం విడుదల చేయాలని కౌన్సిలర్ల డిమాండ్
- 22 మంది కౌన్సిలర్లు మద్దతు ఉంది... చైర్మన్ దొంతగాని శ్రీనివాస్

*ప్రజా వాయిస్ | హుజూర్‌నగర్ | నవంబర్ 10సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ హుజూర్ నగర్ మున్సిపాలిటీలో నిధుల వ్యయంపై పెద్ద ఎత్తున వివాదం చెలరేగింది. మున్సిపాలిటీకి చెందిన రూ. 6 కోట్ల నిధుల ఖర్చుపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. సమావేశ అజెండా మరియు ఆర్థిక లెక్కలపై ఎలాంటి స్పష్టత లేకుండా నిర్వహించిన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం తీవ్ర వివాదాస్పదంగా మారింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన హుజూర్ నగర్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం అనంతరం మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ... పట్టణ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలు, ప్రజా సమస్యలు, వార్షిక కేటాయింపులు, మౌలిక వసతుల కల్పనకు చేసిన నిధుల వ్యయానికి సంబంధించిన సమస్త విషయాలను కౌన్సిలర్లకు స్పష్టంగా వివరించామని ఖర్చులకు సంబంధించిన పత్రాలను సిద్ధం చేసి కౌన్సిలర్లకు అందించినట్లు తెలిపారు. తాము వెల్లడించిన వివరాలకు 22 మంది కౌన్సిలర్లు సంపూర్ణ మద్దతు తెలిపారని పేర్కొన్నారు. రూ.6 కోట్ల నిధుల ఖర్చుపై తలెత్తిన ప్రశ్నలకు సమగ్ర ఆధారాలతో సమాధానాలు ఇస్తామని నిధుల కేటాయింపులు, విడుదల, ఖర్చులు, చెక్కుల వివరాలు, పనుల అంచనాలు, బిల్లులు, పూర్తయిన పనుల వివరాలను బహిరంగపరచినప్పుడే ఈ వివాదానికి తెరపడే అవకాశం ఉందని ప్రజాధనానికి సంబంధించి ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిన బాధ్యత పాలకవర్గం, మున్సిపల్ అధికారులపై ఉందని అన్నారు

రూ. 6 కోట్ల నిధుల ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలని కౌన్సిలర్ల డిమాండ్

ప్రజాధనానికి సంబంధించిన ఖర్చుల వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని, నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ వెల్లడించిన వివరాల ప్రకారం రూ.4 కోట్ల జనరల్ ఫండ్స్,రూ.2 కోట్ల క్యాపిటల్ ఫండ్స్ కలిపి మొత్తం రూ.6 కోట్లు ఖర్చు చేసినట్లు లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. అయితే ఈ నిధులను ఏయే పనులకు వినియోగించారు? ఏ కాంట్రాక్టర్లకు లేదా లబ్ధిదారులకు చెల్లింపులు చేశారు? ఏ తేదీన ఏ చెక్కు ద్వారా నగదు చెల్లించారు? ఏయే వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టారు? అనే కీలక వివరాలు మాత్రం పూర్తిస్థాయిలో వెల్లడించలేదని కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీకి వచ్చిన నిధులు ప్రజల సొమ్ము అయినప్పుడు వాటి వినియోగంపై ప్రజాప్రతినిధులకు పూర్తి సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. జనరల్ ఫండ్, క్యాపిటల్ ఫండ్‌తో పాటు ఎస్ఓఎఫ్ నిధుల వినియోగం, మున్సిపల్ ఆస్తుల వివరాలు, వార్డులవారీగా చేపట్టిన అభివృద్ధి పనుల జాబితాను సమావేశానికి ముందే అందించాలని కోరినప్పటికీ స్పష్టత ఇవ్వకుండా సమావేశం నిర్వహించడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





బహిష్కరణతో నిరసన గళం..

.నిధుల వ్యయం,జమ వివరాలతో పాటు మున్సిపల్ ఆస్తులపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని కోరినా స్పందన లేకపోవడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు సల్లగొండ సుజాత, చిట్టిపోతుల భద్రమ్మ కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించారు. పూర్తి వివరాలు అందించకుండా సమావేశం నిర్వహించడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమని వారు అభిప్రాయపడ్డారు. ముందుగా అన్ని లెక్కలు వెల్లడించి ఆ తర్వాతే సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.



ప్రజా వాయిస్

బుధవారం 11-11-2026

2024 డీఎస్సీ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల నీయామకాల, ప్రమోషన్లలో నకిలీలు?

- పక్క రాష్ట్రాల నుండి నకిలీ స్పెషల్ ఎడ్యుకేషన్ లో బీఈడీ సర్టిఫికెట్ లు ?
- నకిలీ ఆర్.సి.ఐ సర్టిఫికెట్లతో ప్రమోషన్లు?
- మిర్యాలగూడలో నకిలీ ఆర్.సి.ఐ సర్టిఫికెట్ల తయారీలో ఆ వ్యక్తి సిద్ధ హస్తుడు..
- ప్రతి 5 లేదా 7 సంవత్సరాల ఒకసారి సిఆర్ఈ ప్రోగ్రామ్లకు హాజరవుతూ 100 సిఆర్ఈ పాయింట్స్ సంపాదించాలి.
- రెన్యువల్ ఆర్.సి.ఐ సర్టిఫికెట్ కావాలంటే కచ్చితంగా 100 సిఆర్ఈ పాయింట్స్ సంపాదించాలి.
- ఉన్నతాధికారుల అవగాహన లోపమే అక్రమార్కులకు వరం.
- ఆర్.సి.ఐ నకిలీ వ్యవహారాల్లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్ ఉక్కుపాదం మోపుతారా?
- సిబిసిఐడి తో విచారణ జరిపించి.. అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని ఉద్యోగ, విద్యార్థి సంఘాల డిమాండ్.

ప్రజా వాయిస్ ప్రత్యేకం, హైదరాబాద్ :ప్రభుత్వ పాఠశాలలో చదివేటటువంటి దివ్యాంగ బాలబాలికలకు విద్యను బోధించడానికి.. ప్రత్యేక విద్యలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అర్హులుగా పరిగణించి 2024 సంవత్సరములో డీఎస్సీ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఎస్జిటి , స్పెషల్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను నియామకం చేయడం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఈ స్పెషల్ ఎడ్యుకేషన్ కు సంబంధించి సాంక్షన్ పోస్టులు మొదటగా 21-12-2012 నాడు జీవో నెంబర్ 371 ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 23 జిల్లాలకు కలిపి 1476 స్పెషల్ స్కూల్ అసిస్టెంట్ పోస్టు మంజూరు చేశారు.. కానీ 2012 సంవత్సరం సమయంలో తెలంగాణ ఉద్యమం తీవ్రంగా ఉండడంతో ఆ సమయంలో ఆ నియామకాలు చేపట్టలేదు. ఆ తర్వాత 2014 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు ఆయా 1476 పోస్టులను విభజించడం జరిగింది ఆ లెక్క ప్రకారం 800 పైగా పోస్టులు ఏపీకి, 600 పైగా పోస్టులు తెలంగాణకు రావడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ వారు వెంటనే ఆ రాష్ట్రం విభజన తర్వాత ఆ నియామకాలు చేపట్టారు.. కానీ తెలంగాణ రాష్ట్రంలో వాటిని అటకెక్కించారు. రాష్ట్రంలో గల నిరుద్యోగుల ఆధ్వర్యంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు, రిలే నిరాహార దీక్షలు, ప్రయత్నాల వల్ల. అదేవిధంగా సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 2024 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 1500 పోస్టుల మంజూరు చేశారు. అందులో స్పెషల్ ఎస్జిటి పోస్టులు 750, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 750.దివ్యాంగ బాలబాలికలకు విద్యను బోధించడానికి..ఈ పోస్టులకు అర్హతలుగా ఎవరైతే స్పెషల్ ఎడ్యుకేషన్ లో డిప్లమ ఇన్ ఎడ్యుకేషన్ లేదా బ్యాచిలర్ఆఫ్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి రిహాబిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూల్స్ ప్రకారం ఆర్.సి.ఐ నెంబర్ కలిగి ఉంటూ.. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి లేదా ప్రతి ఏడు సంవత్సరాలు ఒకసారి సిఆర్ఈ ప్రోగ్రామ్లకు హాజరవుతూ 100 సిఆర్ఈ పాయింట్స్ తో ఆర్.సి.ఐ సర్టిఫికెట్ కచ్చితంగా రెన్యూవల్ చేసుకున్న వారు మాత్రమే అర్హులు. అయితే ఈ స్పెషల్ ఎడ్యుకేషన్ లో డీఎడ్ చేసిన వారు కొంతమంది 2008 డిఎస్సి ద్వారా సాధరణ పిల్లలకు బోధించే ఉపాధ్యాయులుగా సెలెక్ట్ అయి పని చేయడం కోసమెరుపు.. ఇలా చేయడం డీఎస్సీ నిబంధనలకు విరుద్ధం.

నకిలీ ఆర్.సి.ఐ సర్టిఫికెట్ల తయారీలో ఆ వ్యక్తి సిద్ధహస్తుడు..

ఎప్పుడైతే 2024లో 750 స్పెషల్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు అయ్యాయో వెంటనే 2008 లో ఎస్జిటీ గా చేస్తూ స్పెషల్ ఎడ్యుకేషన్ లో బీఈడీ చేసిన వారు దాదాపు 150 మంది స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ గా ప్రమోషన్ లు తీసుకోవటం జరిగింది.. ఇందులో కొసమెరుపు ఏమిటంటే ప్రమోషన్ తీసుకున్న వారు 2008 నుండి 2024 వరకు ఎలాంటి సిఆర్ఈ ప్రోగ్రాం లకు హాజరు కాకుండా.. నకిలీ ఆర్.సి.ఐ సర్టిఫికెట్ సంపాదించారన్న లుకలుకలు వినిపిస్తున్నాయి. దీనికోసం అప్పటికప్పుడు నల్గొండ జిల్లా మిర్యాలగూడ లో నకిలీ ఆర్.సి.ఐ సర్టిఫికెట్ల తయారీలో సిద్ధహస్తుడు అయిన ఆ వ్యక్తి కి ఒక్కొక్కరు దాదాపు 50,000 నుండి ఒక లక్ష వరకు డబ్బులు ఇచ్చి అప్పటికప్పుడు నకిలీ ఆర్.సి.ఐ రెన్యూవల్ సర్టిఫికెట్ తీసుకున్నట్లు ఉద్యోగస్తులు చెవులు కొరుక్కుంటున్నారు..

అక్రమ మార్గంలో పక్క రాష్ట్రాల నుండి స్పెషల్ ఎడ్యుకేషన్ లో బీఈడీ సర్టిఫికెట్..?

ఇందులో కొంతమంది ఇక్కడ రెగ్యులర్ ఎస్జిటీ లుగా పని చేస్తూ అక్రమ మార్గంలో పక్క రాష్ట్రాల నుండి స్పెషల్ ఎడ్యుకేషన్ లో బీఈడీ సర్టిఫికెట్ లు తెచ్చుకు న్నారు అని వినికిడి.. మరికొంతమంది సర్వశిక్ష అభియాన్ లో కాంట్రాక్టు పద్ధతిలో ఐ.ఈ.ఆర్.పి (ఇన్క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్) పని చేస్తూ.. మళ్ళీ స్పెషల్ ఎడ్యుకేషన్ రెగ్యులర్ గా డి.ఎడ్/ బి.ఎడ్ చేసిన వారు కూడా ప్రమోషన్ లు పొందిన వారు ఉన్నారని వినికిడి..

సిఆర్ఈ ప్రోగ్రామ్లకు హాజరైన అభ్యర్థుల వివరాలు పక్కాగా సేకరించారా?

ఎవరైతే స్పెషల్ ఎడ్యుకేషన్ లో పని చేస్తున్నారో.. వారు సిఆర్ఈ ప్రోగ్రాం లకి హాజరు అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం లు ఆన్ డ్యూటీ సర్టిఫికెట్ సౌకర్యం ఇస్తుంది. దీని ప్రకారం స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ పొందిన వారి సర్వీస్ బుక్.. హాజరు పట్టిక చూసినట్టు అయితే. వీరు ఎప్పుడు ఎక్కడ ఎన్ని రోజులు సిఆర్ఈ ప్రోగ్రాం కు హాజరు అయ్యారో తెలుస్తుంది.. కానీ అలంటిది ఏమి లేకుండానే డైరెక్ట్ గా 2008 నుండి 2024 వరకు దాదాపు అంటే 16 సంవత్సరాలు లాప్స్ ఐనా ఆర్.సి.ఐ సర్టిఫికెట్ లను అక్రమ మార్గం లో రెన్యూవల్ చేసుకొని అడ్డదారిలో ప్రమోషన్ లు పొందారన్నది ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి.చాలా సంవత్సరాల తర్వాత స్పెషల్ ఎడ్యుకేషన్ లో నియామకాలు జరుగటం.. విద్యా శాఖ లో ఉన్న అధికారులకి స్పెషల్ ఎడ్యుకేషన్ పైన వారి సర్టిఫికెట్ ల పైన అవగాహన లేకపోవటం తో జిల్లా స్థాయిలో రిజర్వేషన్ లు కూడా మార్చి వారికి బంధువు లకి ఆయా పోస్టు ఇచ్చుకున్నారు అనే మాట కూడా వినిపిస్తుంది.. దాని పైన కూడా ఎంక్వయిరీ చేయాలని డిమాండ్ చేస్తున్నాముకాబట్టి ప్రభుత్వం వెంటనే స్పెషల్ ఎడ్యుకేషన్ లో అనుభవం ఉన్న ఉన్నత అధికారులతో కమిటీ వేసి నిజాలు వెలికి తీయాలనీ.. నల్గొండ జిల్లా మిర్యాలగూడ లో నకిలీ ఆర్.సి.ఐ సర్టిఫికెట్ల తయారీలో సిద్ధహస్తుడు అయిన ఆ వ్యక్తి ని సిబిసిఐడి తో విచారణ జరిపిస్తే మొత్తం వ్యవహారం బయట పడుతుందని .. అక్రమార్కులకు కఠినంగా శిక్షలు వేసి నిజమైన నిరుద్యోగులకి న్యాయం చేయాలనీ ఉద్యోగ, నిరుద్యోగ, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.









ప్రజా వాయిస్ ఎఫెక్ట్.. కదిలిన పోలీస్ యంత్రాంగం

- బాలికల వేధింపుల ఆరోపణలపై నిందితుడు అదుపులోకి
- నిడమనూరు గురుకులంలో పారిశుద్ధ్య కార్మికుడి అసభ్య ప్రవర్తనపై ప్రజా వాయిస్ కథనం
- స్పందించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్
- విద్యార్థినుల ఆరోపణలతో వెలుగులోకి వచ్చిన వ్యవహారం
- తల్లిదండ్రుల ఆందోళనతో అధికారుల్లో కదలిక
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కనగల్ పోలీసులు.

నల్లగొండ, ప్రజా వాయిస్: ప్రభుత్వ గురుకులాల్లో బాలికల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోందా? చదువుల గుడిలోనే ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతోందా? నల్లగొండ జిల్లా నిడమనూరు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాసంస్థలో వెలుగులోకి వచ్చిన ఘటన ఈ ప్రశ్నలను లేవనెత్తుతోంది. విద్యార్థినుల పట్ల పారిశుద్ధ్య కార్మికుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణలను ప్రజా వాయిస్ వెలుగులోకి తీసుకురావడంతో పోలీస్ యంత్రాంగం స్పందించింది. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలతో పోలీసులు రంగంలోకి దిగి ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్మికుడు సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

బాలికల పట్ల అనుచిత ప్రవర్తన..

నిడమనూరు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాసంస్థలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న సతీష్ విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. వాష్‌రూమ్‌లకు వెళ్లే సమయంలో బాలికలను వెంబడించడం, వారిపై అసభ్యకరంగా చేతులు వేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నాడని విద్యార్థినులు ఆరోపించినట్లు సమాచారం. ఈ పరిణామాలతో బాలికలు తీవ్ర భయాందోళనకు గురైనట్లు తెలుస్తోంది.

దీపావళి సెలవుల్లో బయటపడిన వ్యవహారం..

గతంలో ఎదురైన ఇబ్బందులను భయంతో బయటకు చెప్పుకోలేకపోయిన విద్యార్థినులు దీపావళి సెలవుల సందర్భంగా ఇళ్లకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులకు విషయం వెల్లడించినట్లు సమాచారం. తమ పిల్లలు చెప్పిన విషయాలతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు గురుకులానికి చేరుకుని యాజమాన్యాన్ని నిలదీశారు. బాలికల భద్రత విషయంలో నిర్లక్ష్యం ఎందుకు వహించారని ప్రశ్నిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు.

రహదారిపై తల్లిదండ్రుల నిరసన..

ఈ వ్యవహారంపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు తీవ్రంగా స్పందించాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురుకులం వద్ద నిరసనకు దిగారు. నల్లగొండ–హాలియా ప్రధాన రహదారిపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యార్థినుల భద్రతను పట్టించుకోని అధికారుల బాధ్యతను కూడా తేల్చాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్ ఆదేశాలతో విచారణ..

ఘటన తీవ్రతను గుర్తించిన జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకునే దిశగా విచారణ చేపట్టారు.

ప్రజా వాయిస్ కథనంతో స్పందించిన ఎస్పీ..

గురుకులంలో బాలికల భద్రతకు సంబంధించిన ఈ తీవ్రమైన వ్యవహారాన్ని ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్పందించి పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ ఆదేశాలతో రంగంలోకి దిగిన కనగల్ పోలీసులు బాధిత బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న పారిశుద్ధ్య కార్మికుడు సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని విచారిస్తూ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

బాధ్యులపై చర్యలేవి..?

ఈ ఘటనతో గురుకులాల్లో బాలికల భద్రత, సిబ్బంది పర్యవేక్షణపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థినుల నుంచి ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా గోప్యంగా వాంగ్మూలాలు సేకరించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమని తేలితే నిందితుడిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, విధుల్లో నిర్లక్ష్యం వహించిన యాజమాన్యం, సంబంధిత అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలి.

ప్రజా వాయిస్ డిమాండ్..

గురుకులంలో చదువుకుంటున్న ప్రతి బాలికకు పూర్తి స్థాయి భద్రత కల్పించాలి. విద్యార్థినులకు రక్షణ కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని గురుకులాల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలి.



విద్యా విప్లవానికి పునాదులు వేసిన మేధావి..

- రచయితగా, జాతీయ నాయకుడిగా గుర్తింపు
- మౌలానా అబుల్ కలాం ఆజాద్ నేటి విద్యకు మార్గదర్శకం
- జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వ్యాసం

ప్రజావాయిస్:

విద్య ద్వారానే వ్యక్తి వికాసం, సమాజ చైతన్యం, దేశాభివృద్ధి సాధ్యమని నమ్మిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖామంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, విద్యావేత్తగా ఆయన దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. ఆయన జన్మదినమైన నవంబరు 11ను జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

బాల్యం - స్వాతంత్ర్య పోరాటం

1888 నవంబరు 11న మక్కాలో జన్మించిన ఆజాద్ చిన్ననాటి నుంచే అరబిక్, పారశీకం, ఉర్దూ భాషలతోపాటు పలు శాస్త్రాలను అభ్యసించారు. 1912లో 'అల్ హిలాల్' ఉర్దూ పత్రికను ప్రారంభించి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జాతీయ చైతన్యాన్ని కలిగించారు. మహాత్మా గాంధీతో కలిసి సహాయ నిరాకరణ, ఖిలాఫత్, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితం గడిపారు. హిందూ--ముస్లిం ఐక్యత, జాతీయ సమైక్యతకు జీవితాంతం కృషి చేశారు.

విద్యారంగానికి విశేష సేవలు

1947లో స్వతంత్ర భారత తొలి విద్యాశాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆజాద్ 1958 వరకు విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారు. పేదలు, గ్రామీణ ప్రాంత విద్యార్థులు, బాలికలకు నాణ్యమైన విద్య అందాలని ఆకాంక్షించారు. ఐఐటీ ఖరగ్‌పూర్ ఏర్పాటు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (UGC) అభివృద్ధి, సాంకేతిక విద్యా సంస్థల బలోపేతం, జాతీయ సాంస్కృతిక అకాడమీల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.

రచయితగా, జాతీయ నాయకుడిగా గుర్తింపు

'ఇండియా విన్స్ ఫ్రీడమ్', 'గుబార్-ఎ-ఖాతిర్', 'తర్జుమాన్-ఉల్-ఖురాన్' వంటి రచనలతో సాహిత్య రంగంలోనూ ప్రత్యేక గుర్తింపు పొందారు. దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా 1992లో మరణానంతరం భారతరత్న పురస్కారం లభించింది. 2008లో ఆయన జన్మదినమైన నవంబరు 11ను జాతీయ విద్యా దినోత్సవంగా ప్రకటించారు.



ఆజాద్ ఆశయాలే నేటి విద్యకు మార్గదర్శకం

విద్య కేవలం మార్కులు, డిగ్రీలకే పరిమితం కాకుండా సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, నైపుణ్యాలను పెంపొందించాలని ఆజాద్ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికీ సమాన విద్యావకాశాలు కల్పించడమే ఆయన ఆశయాలకు నిజమైన నివాళి. విద్యతోనే సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని చాటిచెప్పిన ఆయన సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకం.

-యాసిన్ ముహమ్మద్, లెక్చరర్, ప్రభుత్వ ఉన్నత స్థాయి విద్యా అధ్యయన సంస్థ, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్.

ప్రమాదాలకు అడ్డుకట్ట.!

ఎన్‌హెచ్-65పై పోలీసుల ప్రత్యేక దృష్టి
అంజనాపురి, కొత్త మార్కెట్, ఈనాడు జంక్షన్లలో భద్రతా చర్యలు
ఆక్రమణలు, పాదల తొలగింపు.. అవసరమైన చోట్ల లైటింగ్ ఏర్పాటు
వాహనదారులకు ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక

ప్రజా వాయిస్,సూర్యాపేట:

జాతీయ రహదారి-65పై పెరుగుతున్న ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు ప్రమాదాలకు ఆస్కారం ఉన్న అంజనాపురి చౌరస్తా, కొత్త మార్కెట్ చౌరస్తా, ఈనాడు జంక్షన్లలో రహదారి భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు. రహదారులపై ఆక్రమణలు, వ్యాపార ప్రకటన బోర్డులు, పొదలను తొలగించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.వాహనదారులు అతివేగానికి, రాంగ్‌రూట్ ప్రయాణానికి దూరంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు.





మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ప్రమాదకర బైక్ రైడింగ్‌లు, రేసింగ్‌లకు పాల్పడరాదని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం సాగించాలని కోరారు. వాహనదారుల అజాగ్రత్త కుటుంబాలకు తీరని నష్టాన్ని మిగుల్చుతుందని, రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్న, మంద నందిని..

వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామానికి చెందిన క్రీడాకారిణికి వెల్లువెత్తుతున్న అభినందనలు..
హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు,ఉపాధ్యాయులు

ప్రజా వాయిస్ వరంగల్:

గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై తన ప్రతిభను చాటుకుంది. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామానికి చెందిన మంద నందిని తెలంగాణ బాలికల వాలీబాల్ జట్టుకు ఎంపికైంది.ల్యాబర్తి గ్రామానికి చెందిన మంద నందిని ప్రస్తుతం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలికలు), చింతకుంటలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది..నవంబర్ 5, 6, 7 తేదీల్లో గోదావరిఖనిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-17 వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న నందిని తన అద్భుతమైన క్రీడా ప్రతిభతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబర్ 10 నుంచి 16వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని సికార్ పట్టణంలో జరగనున్న జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుంది..ల్యాబర్తి గ్రామం నుంచి తొలిసారిగా జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణిగా నందిని గుర్తింపు పొందడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. గతంలోనూ ఆమె మూడుసార్లు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంది.గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీస్తూ వారిని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయుడు జలగం రఘువీర్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జెల రమేష్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లింగం శైలజ, ల్యాబర్తి గ్రామ సర్పంచ్ మన్నూరు శారద సోము, ఉపసర్పంచ్ సంకినేని గంగరాజు, అభినందించారు..జాతీయస్థాయి పోటీల్లోనూ నందిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణకు, తన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



హన్మకొండలో జాతీయ మహాసభల కరపత్రం ఆవిష్కరణ

భూమి, భుక్తి, విముక్తి కోసం వ్యవసాయ కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి
రాష్ట్ర కన్వీనర్ మల్లేష్

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత వ్యవసాయ-గ్రామీణ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మారపెల్లి మల్లేష్ పిలుపునిచ్చారు. భూమి, ఉపాధి, కనీస వేతనాలు, సామాజిక భద్రత, విద్య, వైద్యం వంటి మౌలిక హక్కుల సాధన కోసం గ్రామీణ పేదలను సమీకరించి పోరాటాలను బలోపేతం చేయాలని అన్నారు. 8వ జాతీయ మహాసభలు నవంబర్ 21, 22 తేదీల్లో జార్ఖండ్ రాష్ట్రంలోని గిరిడీలో జరగనున్నాయి. ఈ మహాసభల సందర్భంగా రూపొందించిన జాతీయ మహాసభల ప్రచార కరపత్రాన్ని మంగళవారం హన్మకొండ జిల్లా కేంద్రంలోని పబ్లిక్ గార్డెన్‌లో రాష్ట్ర కన్వీనర్ మారపెల్లి మల్లేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కన్వీనర్ గోల్కొండ కుమార్, సంఘం నాయకులు గబ్బెట సతీష్, శీలం సురేందర్, యుగేందర్, ఏఐసీసీటీయూ నాయకులు డానియల్, ఇంద్రసేన పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతున్నదని, దాని ప్రభావం ప్రధానంగా వ్యవసాయ కార్మికులు, భూమిలేని పేదలు, చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులపై పడుతున్నదని పేర్కొన్నారు. సాగు ఖర్చులు పెరుగుతున్నా రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, మరోవైపు వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో గ్రామీణ పేదల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయని.తెలంగాణలోనూ వ్యవసాయ కార్మికుల పరిస్థితి అందోళనకరంగా ఉందని, రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రైతులు, కూలీలు, దళితులు, ఆదివాసీలు, మహిళలు, గ్రామీణ పేదల ఆకాంక్షలు ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరలేదని పేర్కొన్నారు. భూమి, పని, కనీస వేతనం, ఇల్లు, విద్య, వైద్యం, సామాజిక భద్రత కోసం పేదలు ఇప్పటికీ పోరాడాల్సిన పరిస్థితి ఉందన్నారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. తెలంగాణలో 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నమోదైన 1,035 లక్షల పనిదినాలు, 2025లో అదే కాలానికి 542.82 లక్షలకు పడిపోవడం గ్రామీణ ఉపాధి సంక్షోభానికి నిదర్శనమని తెలిపారు. ఉపాధి హామీ కింద ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారీ కూలీని పెంచాలని డిమాండ్ చేశారు.భూమిలేని పేదలకు సాగు భూమి పంపిణీ చేయాలని, అసైన్డ్ భూములను పరిరక్షించాలని, పోడు సాగుదారులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అటవీ హక్కుల దరఖాస్తులను పరిష్కరించాలని, కౌలు రైతులకు గుర్తింపు, పంట రుణాలు, పంట నష్టపరిహారం అందించాలని అన్నారు.మహిళా వ్యవసాయ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, దళితులపై కులవివక్ష, అంటరానితనం, సామాజిక దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసి పేదలకు ఉచితంగా నాణ్యమైన సేవలు అందించాలని కోరారు.ఈ సమస్యలన్నింటిపై జాతీయ మహాసభల్లో సమగ్రంగా చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు నాయకులు తెలిపారు. తెలంగాణలోని వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, యువత, మహిళలు జాతీయ మహాసభలకు మద్దతుగా నిలిచి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.భూమి కోసం.. భుక్తి కోసం.. విముక్తి కోసం.. వ్యవసాయ కార్మికుల ఐక్య పోరాటాలను బలోపేతం చేద్దామని వారు పిలుపునిచ్చారు.





నామవరంలో బాధిత కుటుంబాలకు కీసర సంతోష్ రెడ్డి పరామర్శ

మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు
గాయపడిన, అనారోగ్యంతో బాధపడుతున్న నాయకులకు పరామర్శ

ప్రజా వాయిస్, మోతె, నవంబర్ 10:-

మండల పరిధిలోని నామవరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన స్వర్గీయ ఏలేటి వెంకట్ రెడ్డి, స్వర్గీయ బైరి కౌసల్య కుటుంబాలను మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం ఇటీవల ఘర్షణలో గాయపడిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొక్క చంద్రారెడ్డిని, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన తాటికొండ శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చమన్ పల్లిలో మిన్నంటిన 'ఎల్లమ్మ తల్లి' బోనాల కోలాహలం..

భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన సర్పంచ్, లక్ష్మి సుదర్శన్!
మంగళవాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ వైభవంగా జాతర

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

నిర్మల్ జిల్లా లక్ష్మణ్ చందా మండల పరిధిలోని చమన్ పల్లి గ్రామంలో శ్రీ ఎల్లమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం అత్యంత వైభవంగా,భక్తిశ్రద్ధల నడుమ అట్టహాసంగా జరిగింది. గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఊరంతా ఏకమై జరుపుకున్న ఈ వేడుకల్లో భక్తుల కోలాహలం మిన్నంటింది. అమ్మవారి కృపాకటాక్షాల కోసం చమన్ పల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామ మహిళలు తెల్లవారుజాము నుంచే ఎంతో నిష్టతో, పవిత్రంగా కొత్త కుండలలో 'బోనం'(అన్నం, బెల్లం, పాలు కలిపిన నైవేద్యం) తయారు చేశారు.ఆ బోనాల కుండలను కుంకుమ, వేపాకులతో అందంగా అలంకరించి.తలపై పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఎల్లమ్మ తల్లి ఆలయానికి తరలివచ్చారు. డప్పు చప్పుళ్లు,తీన్మార్ శబ్దాలు, పోతురాజుల విన్యాసాలు మరియు శివసత్తుల పూనకాలతో చమన్ పల్లి పురవీధులన్నీ భక్తి రసంలో మునిగిపోయాయి.భక్తులు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.ఈ జాతర మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆలయ పరిసరాల్లో అన్ని రకాల వసతులు,పారిశుద్ధ్య చర్యలు తాగునీటి సౌకర్యాలను కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. "అమ్మవారి కరుణాకటాక్షాల వల్ల మన చమన్ పల్లి గ్రామం పాడిపంటలతో వర్ధిల్లాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఎల్లమ్మ తల్లిని వేడుకున్నాం" అని తెలిపారు.

జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొమ్ము.ఆనంద్



నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొమ్ము ఆనంద్ నియమితులయ్యారు.మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నిరంజన్ ఆనంద్ కు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.పార్టీకి ఎంతో కాలంగా సేవలు అందిస్తున్న ఆనంద్ కు తగిన గుర్తింపు లభించిందని నాయకులు అన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి, జిల్లా అధ్యక్షుడికి కొమ్ము. ఆనంద్ కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పని చేస్తానని ఆయన స్పష్టం చేశారు.ఎస్సీ వర్గాల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి పని చేస్తానని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. ఈసందర్భంగా ఆనంద్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి మరియు ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వ భరోసా

- చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

- తాండూరులో పలువురు లబ్ధిదారులకు రూ.3.82 లక్షల ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ

ప్రజావాయిస్/తాండూరు:

తాండూరు నియోజకవర్గంలోని గాంధీనగర్, ఇందిరానగర్, పాత తాండూరు, బషీరాబాద్ మండలం జీవన్గీ, క్యాద్గిరి తదితర ప్రాంతాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన మొత్తం రూ.3,82,500 విలువైన చెక్కులను తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇందిరా నగర్‌కు చెందిన దయానంద్ కుటుంబానికి రూ.60 వేలు, గాంధీ నగర్‌కు చెందిన కృష్ణమూర్తి కుటుంబానికి రూ.50,వేలు, పాత తాండూరుకు చెందిన మైముదాబేగంకు రూ.20 వేలు, సయ్యద్ షకీల్‌కు రూ.60వేలు, జీవన్గీ గ్రామానికి చెందిన సుదర్శన్ రెడ్డికి రూ.83,000, మడపతి శైలజకు రూ.49,500, రమణారెడ్డి కుటుంబానికి రూ.60,000 చొప్పున చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు కష్టకాలంలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అవసరమైన ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు తమ అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాణిక్ రెడ్డి, సాయిరెడ్డి, బోయ రాజు, మైమూద్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లప్పకు పట్నం పరామర్శ

- అన్నసాగర్ గ్రామస్తులతో ఆత్మీయ అనుబంధం ఎప్పటికీ మరువలేనిది

- చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

కోట్ పల్లి/ప్రజా వాయిస్:

వికారాబాద్ జిల్లా, కోట్‌పల్లి మండలం అన్నసాగర్ గ్రామానికి చెందిన ఎల్లప్ప వికారాబాద్‌లోని ఈశా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా ఎల్లప్ప ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎల్లప్పకు మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులకు సూచించారు.అనంతరం ఎల్లప్ప కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. అన్నసాగర్ గ్రామంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, అక్కడి ప్రజల ఆత్మీయతను ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. ఆపద సమయంలో అండగా నిలవడం, ఆత్మీయులను పరామర్శించడం తన బాధ్యతగా భావిస్తానని ఆయన అన్నారు. ఎల్లప్ప త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని తిరిగి కుటుంబ సభ్యుల మధ్యకు చేరుకోవాలని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ఆకాంక్షించారు.

హాలియా మున్సిపాలిటీలో జిల్లా కలెక్టర్ పర్యటన....



ప్రజా వాయిస్ : హాలియా :నవంబర్:10

నాగార్జునసాగర్ నియోజకవర్గం – హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని, కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని నల్గొండ జిల్లా కలెక్టర్ సందర్శించి అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలు, నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న వసతి, భోజనం, విద్యా సౌకర్యాలను పరిశీలించారు.



విద్యార్థినులకు నాణ్యమైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి ఆరోగ్యం మరియు విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి జిల్లా కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలి...

- ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ చేరాలి

- ఆహారం, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు..

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజా వాయిస్ పెద్దపల్లి

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా లభించే వైద్య సహాయాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో రోగులకు అందించే ఆహారం, పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. మంగళవారం పెద్దపల్లిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ విభాగాలు, వార్డులు, ప్రసూతి గది, అత్యవసర చికిత్స విభాగం, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ తదితర విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న పరికరాలు, మందులు,



వైద్యులు, సిబ్బంది విధుల నిర్వహణపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్యం అందించాలని, అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల చూపుతున్న అంకితభావాన్ని అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా సేవలందించాలని కోరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వంటశాలలు, ఆహార తయారీ ప్రాంతాలు, భోజన ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. వార్డులు, మరుగుదొడ్లు, ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పేద రోగులకు ప్రభుత్వ వైద్య పథకాల ద్వారా అందాల్సిన సహాయం సకాలంలో అందించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్య కార్డులు, వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగుల సమస్యలను సానుకూలంగా స్వీకరించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఐ ఇంద్రసేనారెడ్డిని సస్పెండ్ చేయాలి...

- కమ్యూనిస్టు నాయకులపై దాడి చేశారంటూ పోలీస్ కమిషనర్‌కు సీపీఐ ఫిర్యాదు

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూకు వినతిపత్రం అందజేత

ప్రజా వాయిస్ గోదావరిఖని

వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూకు ఫిర్యాదు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం నేతృత్వంలో నాయకులు కమిషనర్‌ను కలిసి తమ ఫిర్యాదును అందజేశారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఎల్‌బీనగర్, తిలక్‌నగర్ ప్రాంతాల్లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ల పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పార్టీ నాయకులతో దురుసుగా ప్రవర్తించారని, దాడి చేసి దుస్తులు చింపారని



సీపీఐ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ చిరు వ్యాపారులకు న్యాయం జరిగేలా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తాము పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. నిరసనలో భాగంగా దిష్టిబొమ్మ దహనం చేసిన ఘటనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే తాము గౌరవిస్తామని, అయితే ఆ పేరుతో నాయకులపై భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని అన్నారు. సీఐ వ్యవహారశైలిపై గతంలోనూ పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు. స్థానికంగా సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న అధికారుల బదిలీ అంశాన్ని కూడా పరిశీలించాలని కోరారు. దాడికి సంబంధించిన ఘటనపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి గురైన వారిలో దళిత నాయకులు కూడా ఉన్నారని పేర్కొంటూ, ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. సీఐ ఇంద్రసేనారెడ్డి రాజకీయ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, తన వైఖరిని మార్చుకోవాలని హెచ్చరించారు. సీఐపై చర్యలు తీసుకునే వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోషిక మోహన్, సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, జిల్లా సమితి సభ్యులు శనిగరపు చంద్రశేఖర్, రేణుకుంట్ల ప్రీతం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆసాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతతో చెలగాటమాడుతున్న వివేకానంద పాఠశాల.!

కనీస వసతులు కల్పించలేని పాఠశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

కాడపాక రాజశేఖర్ వర్మ

బహుజన విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు

జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం

ప్రజా వాయిస్ ములుగు జిల్లా: మల్లంపల్లి మండలం:/

మల్లంపల్లి మండలంలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించకుండా, విద్యాహక్కు చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ పాఠశాల నిర్వహిస్తున్నారని బహుజన విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజశేఖర్ వర్మ ఆరోపించారు. విద్యార్థుల భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రాజశేఖర్ వర్మ మాట్లాడుతూ..... పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తరగతి గదులు కూడా అవసరమైన సంఖ్యలో లేవని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రత లోపించి పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో విషసర్పాలు, తేళ్లు, ఇతర విషపురుగుల సంచారం వల్ల విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు లేకపోవడం విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని అన్నారు. ఉపాధ్యాయుల అర్హతల విషయంలోనూ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశంపై అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించని మండల విద్యాశాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు?అని ప్రశ్నించారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి పాఠశాలలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, తక్షణమే క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాడపాక రాజశేఖర్ వర్మ కోరారు. విద్యార్థుల భద్రతను కాపాడి వారి బంగారు భవిష్యత్తుకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



పన్నుల పెంపుపై బీజేపీ సమరశంఖం

ప్రజలపై పన్నుల భారం తగ్గించకపోతే పోరాటం ఉధృతం చేస్తాం

సిరికొండ బలరాం,బిజెపి జిల్లా అధ్యక్షుడు.

ఈ నెల 16 నుంచి 48 గంటల నిరాహార దీక్ష

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/

ములుగు పట్టణంలో ఇంటి పన్నులు, వ్యాపార పన్నుల పెంపుపై బీజేపీ పోరుబాట పట్టింది. ప్రజలు, వ్యాపారులపై అదనపు ఆర్థిక భారం మోపేలా పెంచిన పన్నులను తక్షణమే తగ్గించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం డిమాండ్ చేశారు. పన్నుల పెంపునకు నిరసనగా ఈ నెల 16వ తేదీ నుంచి 48 గంటల పాటు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. బీజేపీ ములుగు జిల్లా కార్యాలయంలో ములుగు పట్టణ అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్ అధ్యర్యంలో నిరాహార దీక్ష సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షకు సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు.సిరికొండ బలరాం మాట్లాడుతూ..... ములుగు పట్టణంలో పెంచిన ఇంటి పన్నులు, వ్యాపార పన్నులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లేందుకు 48



గంటల నిరాహార దీక్షకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరై సంఘీభావం తెలుపుతారని పేర్కొన్నారు. పన్నుల పెంపుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వర్తక, వ్యాపార వర్గాలు, పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరాహార దీక్షకు మద్దతు తెలపాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ శ్రేణులన్నీ ఐక్యంగా కృషి చేసి దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మాజీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా కృష్ణవేణి నాయక్, భూక్య జవహర్ లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నగరపు రమేష్, మద్దినేని తేజరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు జినకల కృష్ణాకర్, జిల్లా కోశాధికారి ఇలాంటి శెట్టి రాజ్ కుమార్, జిల్లా మోర్చా అధ్యక్షులు మాదరి శ్రీకాంత్, కొర్ర సుమలత, దండి వెంకన్న, మండల అధ్యక్షులు రాయించు నాగరాజు, బైకాని మహేందర్, కొండబోయిన వెంకటేష్, బోగిరి రాకేష్, అజ్మీరా కిషోర్ నాయక్, లవుడియా నవీన్, సీనియర్ నాయకులు ఎలుకతుర్తి శ్రీహరి, గాదం కుమార్, హేమాద్రి, సిద్ధు, కటయ్య తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు బెల్లంపల్లి పోలీసుల కౌన్సెలింగ్

నేరాలకు దూరంగా ఉండాలి..

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు.

బెల్లంపల్లి ఏసీపీ, కిరణ్ కుమార్ తాళ్లగురిజాల ఎస్ఐ ప్రశాంత్ హెచ్చరిక

ప్రజా వాయిస్.బెల్లంపల్లి

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరిధిలోశాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది. నేరాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో భాగంగా రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా బెల్లంపల్లి ఏసీపీ, తాళ్లగురిజాల ఎస్ఐ .రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. గతంలో వివిధ నేరాలకు పాల్పడి రౌడీషీట్లు కలిగిన వ్యక్తులు ఇకనైనా తమ ప్రవర్తన మార్చుకోవాలని పోలీసు అధికారులు సూచించారు. గొడవలు, దాడులు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తిరిగి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యుల బాధ్యతలను గుర్తించి గౌరవప్రదమైన జీవనం సాగించాలని హితవు పలికారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంటుందని, రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, నేరరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బెల్లంపల్లి



ఏసీపీ, కిరణకుమార్.బెల్లంపల్లి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హనోక్ . తాళ్లగురిజాల ఎస్ఐ ప్రశాంత్ కోరారు.ఈ యొక్క కార్యక్రమములో బెల్లంపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరిధిలో నీ అన్ని పోలీస్ స్టేషన్ ల సీఐ ఎస్సైలు పాల్గొన్నారు.



పుష్కరాల పనులకు వేగం పెంచండి

- మంథని పట్టణ రోడ్ల విస్తరణపై కలెక్టర్ కోయ శ్రీహర్ష దృష్టి

- విద్యుత్ స్తంభాల తరలింపులో జాప్యం వద్దు.. పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజా వాయిస్ మంథని

గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని మంథని పట్టణంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ, విస్తరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మంగళవారం మంథని మున్సిపల్ పరిధిలోని మంథని–గోదావరిఖని ప్రధాన రహదారి, పుష్కర ఘాట్ సమీపంలోని రోడ్డు నిర్మాణ పనులు, మహాలక్ష్మి ఆలయ రోడ్డు విస్తరణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను త్వరితగతిన తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇతర నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. మంథని––గోదావరిఖని రహదారి, పుష్కర ఘాట్ సమీపంలోని రోడ్డు, మహాలక్ష్మి ఆలయ రోడ్డు విస్తరణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. పనులు పూర్తయ్యే వరకు ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మణుగూరు తాసిల్దార్ కార్యాలయంలో

రెవిన్యూ సిబ్బంది ఊసరవెల్లి రంగులు...

సామాన్యుడికి ఏమో చట్టం..! దోపిడీదారులకు రాజకీయ నాయకులకు చుట్టం..?

గుడి పేరుతో ప్రభుత్వ భూమిని స్వాహా చేసిన అవినీతి అధికారులు

సింగరేణి భూ సర్వేలో దొంగలకు ప్రాధాన్యత ఇచ్చిన రెవెన్యూ..

అవినీతి గందరగోళం జరిగిన పట్టించుకోని డివిజన్ సబ్ కలెక్టర్

రవాణా శాఖ ఆర్టీవో కార్యాలయ భూమి కబ్జా చేసిన స్పందించలేని జిల్లా కలెక్టర్...

ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక హెడ్ కోటర్ అయిన మణుగూరు మండల తాసిల్దార్ కార్యాలయంలో అధికారుల విధి నిర్వహణ పరిశీలిస్తే సామాన్య ప్రజలు తలలు బాదుకునే పరిస్థితి ఏర్పడుతుంది. గత తాసిల్దార్ రాఘవ రెడ్డి విధినిర్వహణలో దూకుడు పెంచిన తహసిల్దార్ రాఘవ రెడ్డి ప్రభుత్వ భూములు గుర్తున్నట్టే గుర్తించి ఆ యొక్క భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చెయ్యడం తదుపరి. అంతర్గత ఒప్పందాలతో అగ్రవర్ణ కబ్జాదారులు ఇచ్చే డబ్బుకు ఆశపడిన తహసిల్దార్ రాఘవ రెడ్డి ప్రభుత్వ భూములుగా గుర్తించిన ప్రతి ఒక్క చోట కబ్జా చేసిన దొంగలకే అప్పగించాడు అనేది జగమెరిగిన సత్యమే అయినప్పటికీ.రాఘవరెడ్డి వేరేచోటకు బదిలీ కావడం. తదుపరి ఆ భూముల రికార్డులు తాసిల్దార్ కార్యాలయంలోనే మాయం చేసినట్లు ఆరోపణల గట్టిగానే వినిపించినవి.తదుపరి అదే స్థానంలో విధులు నిర్వహించేందుకు వచ్చిన తహసిల్దార్ అద్దంకి నరేష్. మొదట్లో కొంత వరకు మౌనం పాటించిన.తదుపరి అంతర్గత ఒప్పందాలతో గుట్ట మల్లారం గ్రామంలో కోట్ల రూపాయలు విలువలు చేసే ప్రభుత్వ భూమి గుడి పేరుతో కబ్జా దారులకు అప్పగించినట్లు గుట్ట మల్లారం ప్రజలే ఆగ్రహం వ్యక్తం చేసినారు.వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు మండల రెవెన్యూ కార్యాలయంలో సామాన్య ప్రజలకు చట్టం! దోపిడి దొంగలకు, కబ్జా చేసే బడా బాబులకు రాజకీయ నేతలకు చట్టం అనే విధంగానే అధికారులు విధి నిర్వహణ ఉంది అంటూ మణుగూరు మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామాన్య ప్రజలకు (క్యాస్ట్) (ఇన్కమ్) కుటుంబ ధృవీకరణ సర్టిఫికెట్ అవసర నిమిత్తం ప్రజలు ఎవరైనా తాసిల్దార్ కార్యాలయం ఆశ్రయిస్తే అమాయక ప్రజలను రెవిన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు.అనే విమర్శలుగట్టిగా వినిపించిన. అదే తాసిల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ బినామిగా మారిన చాకలి వ్యక్తికి (ర్) కోయ సర్టిఫికెట్ జారీ చేసి ఏజెన్సీ గిరిజనుల సంక్షేమ పథకాలు కాంట్రాక్టు టెండర్లు, మాయం చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి అదే విధంగా సింగరేణి భూ సర్వేలో సెంటు భూమి లేని అనేక మంది దొంగలను అర్హులుగా ధ్రువీకరించిన రెవెన్యూ అధికారులు ప్యాకేజీ రూపంలో



కోట్లాది రూపాయల సింగరేణి సొమ్మును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారూ అంటూ మేధావి వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. మరో పక్క ప్రధాన రహదారి పక్కనే ఉన్న కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిలో గుడి పేరుతో ప్రభుత్వ భూమి కబ్జాదారులకు అప్పగించినట్లు బహిరంగ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి మరి ఇప్పటికైనా భద్రాచలం సబ్ కలెక్టర్. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తక్షణమే స్పందించి. గుట్ట మల్లారం సమీపంలో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడి మణుగూరు తాసిల్దార్ కార్యాలయంలో జరిగే అవినీతి గందరగోళాలు గుర్తించి అక్రమాలకు సహకరించే అధికారులను చట్టబద్ధంగా శిక్షించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసే అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మణుగూరు మండలం ప్రజలు వేడుకుంటున్నారు...



రూ.1.25 కోట్లతో సీసీ రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభం!

బోడుప్పల్ సర్కిల్‌లోని ఐదు కాలనీలకు మెరుగైన రహదారి సౌకర్యాలు

మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి

కిషోర్ గౌడ్ చేతుల మీదుగా పనులకు శ్రీకారం..

బోడుప్పల్ / ప్రజా వాయిస్:

మేడ్చల్––మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్,చెంగిచెర్ల డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సుభోదయ కాలనీ, గ్రీన్ సిటీ కాలనీ,శ్రీలక్ష్మీనగర్, వివేక్ నగర్,లెక్చరర్స్ కాలనీలలో మొత్తం రూ.1 కోటి 25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త శ్రావంతి కిషోర్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ.....కాలనీలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.స్థానిక ప్రజల అవసరాలు,సమస్యలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ డివిజన్ అధ్యక్షులు పొగుల నర్సింహారెడ్డి,మేడ్చల్ బి–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్,చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు పొగుల దిలీప్ రెడ్డి,బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్,మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత 36వ రైతు మహాసభలను జయప్రదం చేయండి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి పిలుపు

ప్రజావాయిస్,వెంకటాపురం:

నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం తుమ్మల వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో విదేశాల నుంచి మొక్కజొన్న, పత్తి, పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకునేందుకు అవకాశం కల్పించడం వల్ల దేశీయ



రైతులకు నష్టం జరుగుతోందని విమర్శించారు.పార్లమెంటులో కనీన మద్దతు ధర (మీూా) చట్టం తీసుకువస్తామని రైతులకు హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయలేదని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను కూడా అమలు చేయడం లేదని పేర్కొన్నారు.ఈ జాతీయ మహాసభల్లో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, పండించిన పంటలకు పంటల బీమా వర్తింపజేయాలని, 60 ఏళ్లు దాటిన రైతులకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు.అలాగే విద్యుత్ సంస్కరణలను నిలిపివేయాలని, రైతులందరికీ ఉచిత విద్యుత్ అందించాలని, నకిలీ విత్తనాల సమస్యను అరికట్టాలని మహాసభల్లో చర్చించనున్నట్లు వెల్లడించారు.నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభకు రైతులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి జ్ఞానం వాసు, కుమ్మరి శీను, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెం ఆదినారాయణ, నాయకులు కంటెం సత్యం, తోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఓటర్ల జాబితా ప్రక్షాళనపై రాజకీయ పార్టీలతో సమీక్ష

ఎస్ఐఆర్ వెరిఫికేషన్ పారదర్శకంగా చేపట్టాలి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

ఈఆర్ఓ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

ప్రజావాయిస్,రాజేంద్రనగర్:



అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎస్ఐఆర్(ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల పరిశీలన, ధృవీకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కిస్మత్‌పూర్ జోనల్ కార్యాలయంలో ఈఆర్ఓ, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలోని వివరాలను సమగ్రంగా పరిశీలించడం, ఓటర్ల సమాచారాన్ని ధృవీకరించడం,అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం,జాబితాలో ఉన్న తప్పులు, మార్పులను సరిచేయడం వంటి అంశాలపై చర్చించారు.ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు,రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఓటర్ల జాబితా స్వచ్ఛతను కాపాడటంతో పాటు అర్హులైన ఓటర్లెవరూ జాబితా నుంచి తప్పిపోకుండా చూడాలని సమావేశంలో సూచించారు.ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్. మల్లారెడ్డి,కే.రవీందర్ రెడ్డి, ధనంజయ,అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య,శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు,అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్ పంపిణీ

ఉచిత పోలీస్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలి

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

ప్రజా వాయిస్ కొత్తగూడెం.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ మరియు సింగరేణి సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల ఉచిత శిక్షణ తరగతులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ హాజరై అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాల సాధనకు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని, అధ్యాపకులు అందించే సూచనలు పాటిస్తూ



ప్రణాళికాబద్ధంగా చదవాలని అభ్యర్థులకు సూచించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు సమయపాలనతో పాటు నిరంతర సాధన అలవర్చుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకొని కష్టపడి చదివి పోలీస్ ఉద్యోగాన్ని సాధించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖ మరియు సింగరేణి సంస్థ సంయుక్తంగా అందిస్తున్న ఈ శిక్షణ ద్వారా అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించి పోలీస్ శాఖలో ఉద్యోగాలు పొందాలని ఎస్పీ



ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ ఇ. శ్రీనివాస్, ఆర్ఐ ఆపరేషన్స్ బి.రవి, ఆర్ఐ వెల్ఫేర్ కృష్ణారావు, అధ్యాపక బృందం, పోలీస్ అధికారులు, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్

రైతును సన్మానించిన కలెక్టర్

వెల్లినో ప్రభావం కారణంగా ఆరుతడి పంటలు వేయాలి



ప్రజా వాయిస్ ఎల్లారెడ్డిపేట/ సిరిసిల్ల

గొల్లపల్లి గ్రామంలో ఆరుతడి పంటలు, కూరగాయల తోటలను జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ పరిశీలించారు ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన కలెక్టర్ ఆరుతడి పంటలను సాగు చేస్తున్న రైతు గుర్రాల సత్తిరెడ్డి దంపతులతో కలెక్టర్ మాట్లాడి, వారి వ్యవసాయ విధానాలను తెలుసుకున్నారు తక్కువ నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లోనూ ఆరుతడి పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సత్తిరెడ్డి దంపతులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున రైతులు నీటి వినియోగాన్ని తగ్గించే ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, తహసీల్దార్ (ఎంఆర్ఓ), ఎంపీడీఓ, మండల వ్యవసాయ అధికారి, పాల్గొన్నారు





కేశవపట్నం ఎస్సైగా నరేష్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ..

- నూతన ఎస్సైకి పోలీస్ సిబ్బంది ఘన స్వాగతం..

ప్రజా వాయిస్, శంకరపట్నం (నవంబర్ 10):

కరీంనగర్ జిల్లా కేశవపట్నం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా నంది రెడ్డి నరేష్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఆయన కేశవపట్నం వచ్చారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన శేఖర్ రెడ్డి కరీంనగర్ టూ టౌన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్సై సంపత్, హెడ్ కానిస్టేబుళ్లు మోహన్, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు సరిత, అంజలి, హోంగార్డు రజితతో పాటు పోలీస్ సిబ్బంది నూతన ఎస్సై నరేష్‌రెడ్డికి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.



అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

నిబంధనలు ఉల్లంఘిస్తే కార్డుల రద్దు తప్పదు: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

జిల్లాలో అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా అక్రెడిటేషన్ కమిటీ మూడో విడత సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అందిన దరఖాస్తులను పరిశీలించి, అర్హతలు, నిబంధనల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జర్నలిస్టులు వృత్తి నిబద్ధతతో పనిచేయాలని సూచించారుప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజూ దినపత్రికల ప్రచురణ, హాజరు వివరాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కార్డులు పొందినట్లు గుర్తిస్తే వాటిని రద్దు చేస్తామని తెలిపారు. అక్రెడిటేషన్ కార్డులను దుర్వినియోగం చేయడం, వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కార్డులను వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అక్రెడిటేషన్ కన్వీనర్ మెంబర్, డి పి ఆర్ ఓ ఇ. విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు అల్వాల హనుమంతు, రవీందర్, మహేష్, రాజేశ్వర్, అశోక్, నాగరాజు, వసీం, ప్రేమ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



భైంసా సదర్ సంబరాల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హంగామా.. యాదవ సోదరులకు అండగా ఉంటామని హామీ!

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

యాదవ సోదరుల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచే సదర్ పండుగకు,వారి సంస్కృతీ సాంప్రదాయాల రక్షణకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ స్పష్టం చేశారు.భైంసా పట్టణంలోని గణేష్ నగర్ లో కిసాన్ సదర్ కమిటీ వారి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించిన సదర్ సమ్మేళనం వేడుకల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా యాదవ సోదరులకు, పట్టణ ప్రజలకు వారు హృదయపూర్వక సదర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.వేడుకల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ.శతాబ్దాలుగా వస్తున్న సదర్ సంస్కృతిని భైంసా పట్టణంలో ఇంత ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. యాదవ సోదరులు తమ సాంప్రదాయాలను కాపాడుకుంటూ,భావితరాలకు అందిస్తున్న తీరును ఆయన కొనియాడారు. నియోజకవర్గంలో యాదవ సోదరుల అభివృద్ధికి, వారి పండుగలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, వారికి ఏ అవసరం వచ్చినా ముందుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.అనంతరం మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ సమ్మేళనం వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో, పరస్పర సహకారంతో పండుగలను జరుపుకోవడం శుభపరిణామన్నారు.కిసాన్ సదర్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇద్రిస్ బేగ్, స్థానిక కౌన్సిలర్లు, వివిధ ప్రజా ప్రతినిధులు, కిసాన్ కమిటీ నిర్వాహకులు, యువకులు మరియు పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్మల్ గులాబీ రాజకీయం: రైతు గర్జన సభతో బీఆర్ఎస్ పూర్వవైభవం సాధిస్తుందా? కాంగ్రెస్ వైఫల్యాలపై గులాబీ దండు సమరశంఖం!



నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నవంబర్ 11న నిర్వహించ తలపెట్టిన "రైతు గర్జన సభ" తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరియు ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక కీలక మైలురాయిగా మారబోతోంది. గత కొంతకాలంగా నాయకత్వ లోపాలు,అంతర్గత విభేదాలతో సతమతమవుతున్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీకి,తన ఉనికిని చాటుకోవడానికి మరియు బలాన్ని నిరూపించుకోవడానికి ఈ సభ ఒక సువర్ణావకాశంగా నిలిచింది.ఈ భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ముఖ్య అతిథిగా హాజరవుతుండటంతో జిల్లా గులాబీ శ్రేణుల్లో సరికొత్త జోష్ నెలకొంది.మాజీ ఎంపీ బాల్క సుమన్ నేతృత్వంలో బీఆర్ఎస్ జిల్లా ఇన్చార్జి కే. రామ్ కిషన్ రెడ్డి స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండగా,జిల్లాలోని అన్ని మండలాల నుండి భారీ ఎత్తున జనసమీకరణ చేయడానికి పార్టీ శ్రేణులు ముమ్మరంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటికే ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో కడెం మండలంలోని కండకుర్తిలో జరిగిన చేరికలు పార్టీకి మరింత బలాన్ని ఇచ్చాయి.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న తరుణంలో ఈ సభ ప్రాధాన్యత సంతరించుకుంది.ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో కాకుండా విడతల వారీగా చేస్తూ,సాంకేతిక కారణాల సాకుతో సగానికి పైగా రైతులకు



మొండిచేయి చూపించారనే అసంతృప్తి క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తోంది.దీనికి తోడు, రైతాంగానికి ఎంతో ఆసరాగా నిలిచిన "రైతు బంధు" పెట్టుబడి సాయాన్ని "రైతు భరోసా" పేరుతో మారుస్తామని చెప్పి, ప్రస్తుత సీజన్ ముగిసిపోతున్నా సరే ఇప్పటివరకు నిధులు విడుదల చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అతిపెద్ద వైఫల్యంగా మారింది. నూతన నిబంధనల పేరుతో కాలయాపన చేస్తూ సాగు పెట్టుబడి కోసం రైతులను మళ్లీ వడ్డీ వ్యాపారుల దగ్గరకు నెట్టేసే పరిస్థితిని కాంగ్రెస్ పాలన తీసుకొచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా పండించిన పత్తి, సోయాబీన్ పంటలకు మద్దతు ధర (మీర్రా) కల్పించడంలో ప్రభుత్వం మరియు మార్కెటింగ్ శాఖలు పూర్తిగా విఫలమయ్యాయి. కొనుగోలు కేంద్రాల (ఐకేపీ సెంటర్లు) ప్రారంభంలో తీవ్ర ఆలస్యం జరగడం,తేమ శాతం, తాలు పేరుతో మిల్లుల యజమానులు రైతులను నిలువునా దోచుకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.దళారుల చేతుల్లో మోసపోలేక రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాలో తీవ్ర కోతలు విధిస్తూ కరెంట్ కోతలతో రాత్రి పూట పొలాల దగ్గరకు వెళ్లే రైతులు పాము కాట్లకు గురవుతున్న సంఘటనలు గ్రామీణ ప్రాంతాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. విత్తనాలు, ఎరువుల కొరతతో పాటు నకిలీ విత్తనాల నియంత్రణలో ప్రభుత్వ నిఘా లోపించడం వల్ల పెట్టుబడులు పెరిగి, ఆదాయం రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.ఈ క్షేత్రస్థాయి రైతాంగ ఆగ్రహాన్ని, ప్రజా వ్యతిరేకతను ఆసరాగా చేసుకుని నిర్మల్ జిల్లాలో బీఆర్ఎస్ తన రాజకీయ ఉనికిని బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. అయితే, సభ ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నప్పటికీ నిర్మల్ బీఆర్ఎస్ లో అంతర్గతంగా కొన్ని కీలకమైన సవాళ్లు నడుస్తున్నాయి.ఇతర పార్టీల నుండి వచ్చే నాయకులను ఆహ్వానించడంలో స్థానిక సీనియర్ నాయకులు, పాత కార్యకర్తలు కొంత అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండా మోసిన తమకు భవిష్యత్తులో ప్రాధాన్యత దక్కుతుందా లేదా అనే ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.అదే సమయంలో, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో పలువురు అగ్రశ్రేణి నాయకులు కేటీఆర్ సమక్షంలో తిరిగి గులాబీ గూటికి చేరడానికి సిద్ధమవుతున్నారు.ఈ వలసలు మరియు చేరికల నేపథ్యంలో, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని ఏకం చేసి సరైన దిశలో నడిపించే 'అసలైన సారధి ఎవరనే చర్చ ప్రస్తుతం జోరుగా సాగుతోంది.రాబోయే రోజుల్లో నిర్మల్ జిల్లాలో బీఆర్ఎస్ భవిష్యత్తు ఈ రైతు గర్జన సభ సక్సెస్ పైనే ఆధారపడి ఉంటుంది.ఈ సభ ద్వారా కేటీఆర్ క్యాడర్‌లో ఎలాంటి రాజకీయ ఉత్సాహాన్ని నింపుతారు,అలాగే ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీరు, కరెంట్, పెట్టుబడి సాయం మరియు మద్దతు ధరల వంటి సమస్యలపై ఎలాంటి ప్రత్యక్ష పోరాట కార్యాచరణ ప్రకటిస్తారు అనేది అత్యంత కీలకం. ఈ "రైతు గర్జన సభ" అనేది కేవలం ఒక బలప్రదర్శన మాత్రమే కాదు; ఇది రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడానికి మరియు జిల్లాలో బీఆర్ఎస్ ఉనికికి, భవిష్యత్తు రాజకీయ మనుగడకు ఒక నిశ్చబ్ద పరీక్ష. అంతర్గత కుమ్ములాటలను పక్కనపెట్టి, కొత్త-పాత నాయకులను సమన్వయం చేసుకుంటూ, రైతుల పక్షాన నిలబడి పోరాడితేనే రాబోయే రోజుల్లో గులాబీ పార్టీ పూర్వవైభవాన్ని సాధించగలదు.

కమలానికి కార్యకర్తలే వెన్నుముక

గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయాలి..

స్థానిక పోరులో విజయమే లక్ష్యంగా శ్రమించాలి..

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరు వీరారెడ్డి

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తూ, బూత్ స్థాయి నుంచి బిజెపి పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి పిలుపునిచ్చారు.యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సుర్వి రాజు గౌడ్ అధ్యక్షతన పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులకు వీరారెడ్డి నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కేంద్ర పథకాలను ప్రతి



ఇంటా ప్రచారం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. పంచాయతీ ఎన్నికల విజయాల స్ఫూర్తితో రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కష్టపడి పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు దాసోజు వెంకటాచారి, గొల్లూరి యాదగిరి, జక్కర్తి బిక్షం, చిలువేరు వెంకటేశం, కోడూరు బీరయ్య, బద్దం



యాదయ్య గౌడ్, కట్కూరి లక్ష్మీ, వెంకటేష్ గౌడ్, గూడూరు ఇంద్రసేనారెడ్డి, జక్కర్తి నరసింహ, జర్పుల వినోద్, అంతటి సురేష్ గౌడ్, కోగూరి శ్రవణ్ కుమార్,మెరుగు సైదులు, ఉష్కాగుల గిరిబాబు గౌడ్, కుకుడాల మహేందర్ రెడ్డి, నెల్లికంటి శ్రీశైలం యాదవ్, చెరుకుపల్లి రమణమ్మ, అనిల్, గూడేల్లి బాలరాజు, కరంటోత్ రమేష్ నాయక్, చెరుకుపల్లి సత్తయ్య, కందాల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకందని ఇందిరమ్మ ఇళ్లు!

- భారీ వర్షాలకు కూలిన నిరుపేద కుటుంబం నివాసం..

- నిలువ నీడ కరువు

- అర్హత ఉన్నా అందని ప్రభుత్వ పథకం..

- అధికారుల చొరవ కోసం బాధిత కుటుంబం ఎదురుచూపు

ప్రజా వాయిస్ సైదాపూర్ :-

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిజమైన అర్హులకు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కొందరు నిరుపేదలకు మాత్రం నిరాశే మిగులుతోంది. ఇందుకు నిదర్శనంగా భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయి, నిలువ నీడ కోల్పోయిన ఓ నిరుపేద కుటుంబం పరిస్థితి కనిపిస్తోంది. సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన జేరిపోతుల రాజు ఏళ్ల తరబడి కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ముతో నిర్మించుకున్న చిన్న ఇంటిలో జీవనం సాగిస్తున్న ఆ కుటుంబానికి భారీ వర్షాలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. వర్షాల ధాటికి ఇల్లు కూలిపోవడంతో కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. ఒకవైపు కూలిపోయిన ఇంటి శిథిలాలు, మరోవైపు నిత్యావసరాల కోసం పడరాని పాట్లు పడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. కనీసం తలదాచుకునేందుకు సరైన వసతి కూడా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే, నిజంగా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇల్లు కూలిపోయి రోడ్డున పడిన కుటుంబానికి ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.ప్రభుత్వ పథకాల అసలు లక్ష్యం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందినప్పుడే వాటి ప్రయోజనం



నెరవేరుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బాధిత కుటుంబం పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, అర్హతను నిర్ధారించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు తక్షణ సహాయం అందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.కూలిన గోడల మధ్య కన్నీటి జీవితం గడుపుతున్న ఆ నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం ఎప్పుడు అండగా నిలుస్తుందో వేచి చూడాల్సిందే!

మహిళా ప్రొఫెసర్ నాపై చేస్తున్నవి నిరాధార ఆరోపణలు

సమగ్ర విచారణ జరిపించాలని డీజీపీకి వీసీ జానయ్య ఫిర్యాదు

సాధారణ బదిలీ నేపథ్యంలోనే ఆరోపణలు చేస్తున్నారని వెల్లడి

వాట్సాప్ చాట్లు,కాల్‌హిస్టరీ పరిశీలించాలని విజ్ఞప్తి

ప్రజా వాయిస్॥ రాజేంద్రనగర్:

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్యపై మహిళా అధ్యాపకురాలు చేసిన ఆరోపణల వ్యవహారంలో ఆయన స్పందించారు.తనపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొంటూ,వాస్తవాలను వెలికితీసేందుకు సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు.విశ్వవిద్యాలయంలో పరిపాలనా సంస్కరణలు, బదిలీల నేపథ్యంలో కొందరు అసంతృప్త వ్యక్తులు తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రొఫెసర్ జానయ్య తన ప్రకటనలో పేర్కొన్నారు.నిజామాబాద్ జిల్లా రూరూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో పనిచేస్తున్న మహిళా అధ్యాపకురాలిని సెప్టెంబర్ 11,2026న నిబంధనల ప్రకారం సాధారణ గ్రూప్ బదిలీ చేసినట్లు తెలిపారు. ఈ బదిలీని మనసులో పెట్టుకుని తనపై ఆరోపణలు చేస్తున్నారని ఆయన వాదించారు.నవంబర్ 7న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహిళా అధ్యాపకురాలు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు.తన 35 ఏళ్ల బోధన,పరిశోధన, పరిపాలనా జీవితంలో మహిళా సహోద్యోగుల పట్ల ఎప్పుడూ అనుచితంగా ప్రవర్తించలేదని స్పష్టం చేశారు.తన వ్యక్తిగత ప్రతిష్ఠతో పాటు



ఉపకులపతి పదవి గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళా అధ్యాపకురాలితో తనకు మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణలు, ఫోన్ కాల్ వివరాలు సహా అందుబాటులో ఉన్న డిజిటల్ ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించాలని లేఖ ద్వారా డీజీపీని కోరినట్లు తెలిపారు. ఆరోపణల వెనుక ఇతరుల ప్రమేయం ఉందా అనే కోణంలోనూ విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.మహిళా అధ్యాపకురాలు చేసిన ఆరోపణలు,వాటిని ఖండిస్తూ వీసీ జానయ్య ఇచ్చిన వివరణపై సమగ్ర విచారణ ద్వారానే వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.ఈ మేరకు ప్రొఫెసర్ జానయ్య కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేసింది.

మూడు దశాబ్దాల సేవకు జాతీయ గుర్తింపు

చింతాబాబు మాదిగకు అంబేద్కర్ జాతీయ పురస్కారం

ఈ నెల 15న ఢిల్లీలో అవార్డు ప్రదానం

బహుజన హక్కుల కోసం అలుపెరుగని పోరాటం

ప్రజా వాయిస్,కోదాడ:



బహుజన హక్కుల సాధన కోసం మూడు దశాబ్దాలుగా సాగిస్తున్న పోరాటానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఎమ్మార్పీఎస్ కీలక నేత, బహుజన ఉద్యమ నాయకుడు చింతాబాబు మాదిగను ప్రతిష్ఠాత్మక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ పురస్కారం వరించింది. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఈ అవార్డును ప్రకటించారు. ఈ నెల 15న ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో చింతాబాబు అవార్డును అందుకోనున్నారు. ఈ విషయాన్ని ఆయన మంగళవారం వెల్లడించారు.1990వ దశకం నుంచి సామాజిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్న చింతాబాబు.. మార్గదర్శి యూత్, స్ఫూర్తి యూత్ సంస్థల ద్వారా యువతలో చైతన్యం నింపారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా బహుజన హక్కుల కోసం పలు ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. గతంలో ఫ్రెండ్‌షిప్ సొసైటీ అవార్డులతో పాటు దళిత రత్న పురస్కారాన్ని అందుకున్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా మాదిగ బంధు బిరుదును కూడా స్వీకరించారు. తాజాగా అంబేద్కర్ జాతీయ పురస్కారానికి ఎంపిక కావడంతో పలువురు నాయకులు, బహుజన సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

దివ్యాంగులకు ఉపాధి బాట

మోతెలో పది రోజుల పాటు ఉచిత శిక్షణ

- **18 నుంచి 50 ఏళ్ల మహిళలు, పురుషులకు అవకాశం**
- **కేంద్ర ప్రభుత్వ సహకారం.. ఎస్‌బీఐ నల్లగొండ సౌజన్యం**
- **స్వయం ఉపాధి నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ**
- **ఆధార్, రేషన్, సదరం సర్టిఫికెట్లతో దరఖాస్తు**



ప్రజా వాయిస్, మోతె, నవంబర్ 10:-

దివ్యాంగులు ఆర్థికంగా ఎదిగి స్వయం ఉపాధి పొందేలా పల్లెల పరివర్తన సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పది రోజుల పాటు ఉచిత వ్యాపార నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ పల్లెల లక్ష్మణ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో, ఎస్‌బీఐ నల్లగొండ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. 18 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు, పురుషులు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణకు హాజరయ్యేవారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులతో పాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.



సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన వైఎస్సార్

వాటర్ ఫిల్టర్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

మన తెలంగాణ / ప్రజా వాయిస్ :-

మండలం లోని గిరిబోయినగూడెం గ్రామంలో గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సత్సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవరెడ్డి తన సొంత నిధులతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ నూతన వాటర్ ప్లాంట్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ముందుకు వచ్చి సొంత ఖర్చులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన యెల్లంల సంజీవరెడ్డిని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రత్యేకంగా అభినందించారు. సమాజ సేవా దృక్పథంతో దాతలు ఇలా ముందుకు రావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. తమ గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ దాతకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎర్రజెండా వైపు యువత అడుగులు

10 కుటుంబాలు సీపీఎంలో చేరిక

వివిధ పార్టీలకు రాజీనామా

ప్రజా పోరాటాలే ఆకర్షణగా చేరిన యువకులు



ప్రజా వాయిస్, మోతె, నవంబర్ 10:-

మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం గ్రామంలో సీపీఎంకు కొత్త బలం చేకూరింది. మండలంలో పార్టీ నిర్వహిస్తున్న ప్రజా పోరాటాలకు ఆకర్షితులై చింతమల్ల రాజు నాయకత్వంలో 10 కుటుంబాలకు చెందిన యువకులు వివిధ పార్టీలకు రాజీనామా చేసి సీపీఎంలో చేరారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు వారికి ఎర్రజెండాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. కష్టజీవుల హక్కుల సాధన, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా సీపీఎం పోరాడుతోందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడిచినా ఆర్థిక అసమానతలు తొలగలేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై యువత ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మోతే మండలంలో పార్టీ బలోపేతం అవుతోందని, కొత్తగా చేరిన కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ నెల 15న నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభకు రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.కార్యక్రమానికి సీపీఎం గ్రామ కార్యదర్శి షేక్ జహీనాభి అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, మండల కమిటీ సభ్యులు నాగం మల్లయ్య, చర్లపల్లి మల్లయ్య, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి వెలుగు మధు, నాయకుడు గౌస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోవాలి..

ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన

దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి

ప్రజా వాయిస్/ దుబ్బాక

రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు విక్రయించుకోవాలని దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి తెలిపారు. దుబ్బాక మండలంలోని పెద్ద గుండవెల్లి, వెంకటగిరి తండా, శిలాజి నగర్, పోతారం, అచ్చమాయపల్లి, ఆరేపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొంగరి రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యం విక్రయించే సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సన్న ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించనున్నట్లు తెలిపారు. దొడ్డు ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ధాన్యం కొనుగోలుకు అవసరమైన సన్న, దొడ్డు వడ్లకు సంబంధించిన సుతిల్ తాళ్లను గోనె సంచుల కట్టేందుకు ఉపయోగించే తాళ్లు ప్రభుత్వం వీవో కేంద్రాల ద్వారా ఉచితంగా అందిస్తుందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని కొంగరి రవి కోరారు.



ప్రజల తాగునీటి అవసరాల కోసం ముందస్తు చర్యలు

30 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న కోటగడ్డ బావికి పునర్జీవం!

ప్రజా వాయిస్ భీమదేవరపల్లి.

భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామ ప్రజలకు రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా, గత 30 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న కోటగడ్డలోని పురాతన బావికి పునర్జీవం కల్పించే దిశగా ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి గారు పూడికతీత పనులను ప్రారంభించారు.ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం, రానున్న వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మమతా బాలకృష్ణ గారు, పాలకవర్గ సభ్యులు కొబ్బరికాయ కొట్టి పూడికతీత పనులను లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సంరక్షిస్తూ, వాటికి పునర్జీవం కల్పించి ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గం చేపట్టిన ఈ ముందస్తు చర్యలను ప్రజలు అభినందించారు.

రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి....

ఐదు గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్..

దేగాం గ్రామం లో పలు అభివృద్ధి పనులు ప్రారంభం...

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి





రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. మంగళవారం బైంసా మండలంలోని దేగాం, వాలెగాం, కుంసర, కామోల్, వానల్పాడ్, తిమ్మాపూర్, గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.బహిరంగ మార్కెట్లో ధర తక్కువగా ఉంటే రైతాంగానికి మద్దతు ధర కల్పించేందుకు ఈ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏ గ్రేడ్ రకం వరికి క్వింటాలకు 2461రూపాయలధర, బి గ్రేడ్ రకం క్వింటాలుకు 2441 రూపాయల ధర, 7 సన్న రకాలకు అదనంగా క్వింటాలుకు 500 బోనస్ ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభించి. ఎల్. ని నో ప్రభావంతో రైతులు నష్టాల్లో ఉన్నారని, ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

దేగాం గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం....

దేగాం గ్రామంలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు.అదేవిధంగా 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన మహిళా షెడ్డు భవనాన్ని ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చిత్తబుట్టలను పంపిణీ చేశారు.



ఇంటింటికీ తాగునీరు... వీధివీధికీ మురుగు కాలువల పరిష్కారం

గోల్డెన్ హైట్స్,బుద్వేల్‌లో రూ.2.37 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

ప్రజావాయిస్॥రాజేంద్రనగర్:

కాలనీల్లో తాగునీటి ఇబ్బందులకు తెరదించి,మురుగునీటి పారుదల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయి. ఇందులో భాగంగా హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ ఆధ్వర్యంలో రూ.2.37 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రెండు కీలక పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.రాజేంద్రనగర్ సర్కిల్, బండ్లగూడ వార్డు పరిధిలోని గోల్డెన్ హైట్స్ కాలనీలో నూతన తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి, బుద్వేల్‌లోని బక్క డాక్టర్ గల్లీలో సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణానికి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు కనీస అవసరమైన తాగునీరు,మురుగునీటి పారుదల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.కాలనీల్లో మౌలిక వసతుల కొరత లేకుండా అవసరమైన నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.కేవలం హామీలకే పరిమితం కాకుండా ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులను గుర్తించి కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని అన్నారు.చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.రూ.2.37 కోట్లతో చేపడుతున్న ఈ పనులు పూర్తయితే గోల్డెన్ హైట్స్ కాలనీలో తాగునీటి సరఫరా మెరుగుపడటంతో పాటు,బుద్వేల్ బక్క డాక్టర్ గల్లీలో మురుగునీటి పారుదల సమస్యకు ఉపశమనం లభించనుంది.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారులు,పార్టీ నాయకులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



పరకాల మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

ప్రజా వాయిస్ హన్మకొండ /పరకాల

పరకాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యాలయంలో అధికారులు, సిబ్బంది హాజరు, పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. హాజరు రిజిస్టర్ ను పరిశీలించి, విధులకు హాజరు కాని అధికారులు, సిబ్బంది పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజల పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, త్రాగునీరు, వీధి దీపాలు, రోడ్ల నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అఖిల భారత రైతు సంఘం 36వ మహాసభలను జయప్రదం చేయండి

కార్మిక-కర్షక ఐక్యతను బలోపేతం చేద్దాం

నవంబర్ 15న నల్లగొండలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ

ప్రజా వాయిస్ తాండూర్/బెల్లంపల్లి

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండలం లో అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 15న భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా తాండూరు మండల కేంద్రంలోని ఐబీ హమాలీ కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, వ్యవసాయ కార్మిక సంఘం తాండూరు మండల అధ్యక్షులు వేల్పుల శంకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల వల్ల రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం, కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడులను తీసుకురావడం కార్మిక, కర్షక వర్గాలకు నష్టం కలిగిస్తున్నాయని అన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ మహాసభల్లో గత పోరాటాలను సమీక్షించి, రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చింతపురి లక్ష్మణ్, తొగరి శ్రీనివాస్, బుర్ర రాగులయ్య, మాసాడి తిరుపతి, మాసాడి చిన్న తిరుపతి, కొమ్మ శంకర్, ఆయిల శంకర్, కొండు రాములు, రుకుం బావు, పుట్ట సురేష్, వృద్ధార్థి శంకర్, జైనేని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు 18 వేల వేతనం కల్పించాలి

ఉద్యోగ భద్రత,రూ.50 లక్షల బీమా,రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ అందించాలని

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సీఐటీయూ నేతల వినతి

అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే హామీ

ప్రజావాయిస్,రాజేంద్రనగర్:



ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించి, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జాజాల రుద్రకుమార్ అధ్యక్షతన ఆశా వర్కర్లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆశాలు మాట్లాడుతూ..ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల వేతనం,ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రూ.50 లక్షల బీమా,రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ అందించాలని కోరారు.ప్రతి ఆదివారం సెలవు,ఏడాదికి 20 రోజుల క్యాజువల్ సెలవులు,ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే రెండో పీఆర్సీలో రూ.30 వేల వేతనం నిర్ణయించాలని,ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి డీఏ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని,తగిన శిక్షణతో పాటు పదోన్నతుల అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని కోరారు.వినతిపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ,ఆశా వర్కర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు పి.భాస్కర్,బి.వెంకటయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు లత,శ్రీదేవి, జ్యోతి,అనిత తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులు నాణ్యతతో చేపట్టాలి

నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని సూచన

ప్రజా వాయిస్ దౌల్తాబాద్, నవంబర్ 10:

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధికి దోహదపడే ఉపాధి హామీ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సర్పంచ్ అల్లి శేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం గువ్వలేగి గ్రామంలో వివిజిరామ్ జీ పథకంలో భాగంగా చేపడుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీల పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను నిర్ణీత ప్రమాణాల ప్రకారం చేపట్టాలని సూచించారు. కూలీలు పనులు చేసేటప్పుడు నిబంధనలు పాటిస్తూ, కేటాయించిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు.గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులు భవిష్యత్తులో ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, ప్రతి పనిలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సూచనలు, సహకారం అందిస్తామని తెలిపారు.

కేజీబీవీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి:జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

ప్రజా వాయిస్ అచ్చంపేట నవంబర్ 10

అచ్చంపేట లోని మంగళవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో కేజీబీవీ పాఠశాలను సందర్శించారు విద్యార్థినులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. అచ్చంపేట మండలం నడింపల్లి కేజీబీవీని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, పాఠశాలలో మౌలిక వసతులు, బోధన, భోజనం, విద్యార్థినుల ప్రవేశాలపై ఆరా తీశారు. 160 మంది విద్యార్థినులకు గాను ప్రస్తుతం 95 మంది మాత్రమే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇంటర్మీడియట్ కోర్సుల్లో 100 శాతం ప్రవేశాలు నమోదు చేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. నల్లమల ప్రాంత విద్యార్థినులకు



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) కోర్సులపై అవగాహన కల్పించి, ఏఐ విద్య ద్వారా భవిష్యత్తులో లభించే అవకాశాలను వివరించి ప్రోత్సహించాలని సూచించారు.పదో తరగతి విద్యార్థినులు రాస్తున్న తెలుగు స్లిప్ టెస్టును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థినులను గుర్తించి అదనపు బోధన అందించాలని సూచించారు. విద్యార్థినులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, వంటశాల, భోజనశాల, తాగునీరు, మరుగుదొడ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.పాఠశాల భద్రత కోసం ప్రహరీ గోడ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్రీడా మైదానాన్ని లెవలింగ్ చేసి విద్యార్థినులకు అనువుగా అభివృద్ధి చేయాలని, విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థినులనుప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థినుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపుపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట గ్రామ సర్పంచ్ గోపి పద్మ, ఎంఈఓ శ్రీనివాస మూర్తి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన

- సౌర విద్యుత్‌తో కరెంటు బిల్లులకు చెక్ పెట్టాలి..

- మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్

ప్రజా వాయిస్ మంథని

మున్సిపల్ కార్యాలయంలో పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీజీ ఎన్‌పీడీసీఎల్, టీజీ ఆర్ఈడీసీఓ, సోలార్ వెండర్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటి పైకప్పులపై సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు, ప్రభుత్వం అందించే రాయితీలు, బ్యాంకు రుణ సదుపాయాలు, పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మంథని పట్టణంలో సౌర విద్యుత్ వినియోగంపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వార్డు సభ్యుడు స్వచ్ఛందంగా తమ ఇళ్లపై సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన



సోలార్ ప్లాంట్ ద్వారా నెలకు సుమారు 300 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉందని వివరించారు. అవసరానికి మించి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసే అవకాశం కూడా ఉందన్నారు. పెద్దపల్లి ఎస్ఈ గంగాధర్ మాట్లాడుతూ గృహ అవసరాలకు సౌర విద్యుత్‌ను వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవచ్చని సూచించారు. టీజీ ఆర్ఈడీసీఓ డీఎం మనోహర్ మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం కింద అందించే రాయితీలు, బ్యాంకు రుణ సదుపాయాల గురించి వివరించారు. అర్హులైన కుటుంబాలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుగా తమ ఇళ్లపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకొని ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, మారుపాక నిహారిక, పెంటరి రాజు, ఎల్లెంకి వంశీధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, నాయకులు ఎరుకల రమేష్, జంబోజు సమ్మయ్య, లైశెట్టి రాజు, వేముల సమ్మయ్య, శశిభూషణ్ కాచే, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, విద్యుత్ శాఖ అధికారులు, సోలార్ వెండర్లు తదితరులు పాల్గొన్నారు.

వంగర గ్రామ భారత రాజ్యాంగ పరిరక్షణ శాఖ అధ్యక్షుడిగా కడారి బాబు

ప్రధాన కార్యదర్శిగా మంచాల శ్రీనివాస్

ప్రజా వాయిస్ భీమదేవరపల్లి.

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామస్థాయిలో రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని బలోపేతం చేయడంతో పాటు, ప్రజల్లో రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో గ్రామ శాఖ అధ్యక్షుడిగా కడారి బాబు, ప్రధాన కార్యదర్శిగా మంచాల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా గజ్జెల ప్రశాంత్, మేరుగు శ్రీకాంత్,భూనాద్రి వెంకటస్వామి, సలహాదారులుగా ఏనుక రాములు, రొడ్డ వీరస్వామి, కండె చక్రపాణి,కో-ఆర్డినేటర్‌గా కాల్వ నరేష్,సహాయ కార్యదర్శులుగా పొన్నాల రాజు, గజ్జెల వెంకట స్వామి,ఐలవేని సమ్మయ్య,వేముల రమేష్, కార్యవర్గ సభ్యులుగా మ్యాదరి సదానందం,మల్లమారి శ్రీనివాస్, ఐలవేని సమ్మయ్య,వేముల (పెద్ద) రమేష్ ఎన్నికయ్యారు.రాజ్యాంగం ఆమోదం పొందిన నవంబర్ 26వ తేదీని పురస్కరించుకొని హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. అంబేద్కర్ వాదులు, ప్రజాస్వామ్యవాదులు, యువత, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల రాజ్యాంగ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఉప్పుల కుమారస్వామి, మండల ఉపాధ్యక్షులు కండె సుధాకర్, ప్రధాన కార్యదర్శి రేణుకుంట్ల బిక్షపతి, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు, వార్డు సభ్యులు గజ్జెల సురేష్, మాజీ సర్పంచ్ కండె రమేష్, మాజీ వార్డు సభ్యులు గిన్నారపు కుమారస్వామి, మంచాల చంద్రమౌళి, గుండాల శంకర్,



మిడిదొడ్డి తిరుపతి, రొడ్డ వీరయ్య, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు



ముత్తిరెడ్డిగూడెంలో ముదిరాజ్ సంఘానికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలి

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు వినతిపత్రం అందజేత

మోటకొండూరు, నవంబరు 10(ప్రజా వాయిస్):-

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి విచ్చేసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ఆ గ్రామ ముదిరాజ్ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.గ్రామంలో సుమారు 50 ముదిరాజ్ కుటుంబాలు నివసిస్తున్నాయని, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి కమ్యూనిటీ హాల్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. గతంలో గ్రామానికి వచ్చినప్పుడు కమ్యూనిటీ హాల్ మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని గుర్తుచేశారు. ముదిరాజ్ సంఘం సమావేశాలు, వివాహాలు, శుభకార్యాలు మరియు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గడానికి కమ్యూనిటీ హాల్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొంటూ, తక్షణమే హాల్ మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని వారు ఆ వినతిపత్రం ద్వారా కోరారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జోరుక ఎల్లేష్ ముదిరాజ్.,మాజీ అధ్యక్షులు గుర్రాల రవి ముదిరాజ్,ముదిరాజ్ సంఘం నాయకులు గుర్రాల పరమేష్ ముదిరాజ్, గుర్రాల శ్రీను ముదిరాజ్,అన్నబోయిన నాగయ్య ముదిరాజ్, నీల రాజు ముదిరాజ్,గుర్రాల వెంకన్న ముదిరాజ్,రాపాక వెంకన్న ముదిరాజ్,గుర్రాల నాగరాజు ముదిరాజ్,గుర్రాల రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన..

అంజన్న గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం

200 మందికి నేత్ర పరీక్షలు..

35 మందికి శస్త్రచికిత్స..

ప్రజా వాయిస్, కోదాడ:



కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి ప్రోత్సాహంతో కోదాడ 30 వ వార్డు కౌన్సిలర్ కారింగుల ఉమ అంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. శంకర కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ శిబిరంలో మొత్తం 200 మంది పాల్గొని నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్నారు.వైద్య పరీక్షల అనంతరం 35 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించిన వైద్యులు,వారికి చికిత్స చేశారు.పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం పలువురికి ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.సామాజిక బాధ్యతతో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకొచ్చిన కౌన్సిలర్ కారింగుల అంజన్ గౌడ్ కృషిని పలువురు అభినందించారు.ఇటువంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగాలని స్థానికులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చలిగంటి ప్రసాద్,పంది తిరపయ్య ఎన్సిహెచ్ రాము,రాపోలు శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్,వంగవీటి శేఖర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, మిట్టకోలు కమలాకర్,చలిగంటి రంగా, తంగెళ్ళపల్లి లక్ష్మణ్, మల్లయ్య, స్టాలిన్,నర్సి, శివ, శేషు,నజీర్, రవి తదితరులు పాల్గొన్నారు

గంగపుత్ర జాతిపిత ఆచార్య సందిరి బాలయ్య జీవిత చరిత్ర

నవంబర్ 11న జయంతి

ప్రజా వాయిస్ హైదరాబాద్/

ఐక్యత, విద్య, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యానికి జీవితాన్ని అంకితం చేసిన మహానీయుడు గంగపుత్ర సమాజ చరిత్రలో ఆచార్య సందిరి బాలయ్య ఒక విశిష్టమైన నాయకుడిగా, సంఘ సంస్కర్తగా, సామాజిక చైతన్యవేత్తగా నిలిచారు. సంప్రదాయ మత్స్యకార సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్యా వెనుకబాటుతనాన్ని అర్థం చేసుకుని, ప్రజలను సంఘటితం చేయడం, విద్యావంతులను చేయడం, ఆత్మగౌరవాన్ని పెంపొందించడం, సంఘటిత శక్తి ద్వారా హక్కుల కోసం పోరాడే చైతన్యాన్ని కల్పించడం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారు. అందుకే గంగపుత్ర సమాజం ఆయనను "గంగపుత్ర జాతిపిత", **"మత్స్యకార మహాత్ముడు"**గా గౌరవిస్తుంది.

బాల్యం - కుటుంబ నేపథ్యం

ఆచార్య సందిరి బాలయ్య 1911 నవంబర్ 11వ తేదీన నాటి కరీంనగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని ఎలగందుల గ్రామంలో తల్లి రాజమ్మ, తండ్రి బాలయ్య దంపతులకు జన్మించారు. ఆయన స్వగ్రామం ఎలగందుల. అనంతరం జీవనోపాధి కోసం హైదరాబాద్ నగరానికి వచ్చి బేగంబజార్‌లో తమలపాకుల వ్యాపారం నిర్వహించారు.ఆయన జీవించిన కాలం సామాజికంగా, ఆర్థికంగా అనేక సవాళ్లతో కూడుకున్నది. నిజాం పాలన కాలంలో నిరక్షరాస్యత, సామాజిక వివక్ష, ఆర్థిక వెనుకబాటుతనం వంటి సమస్యలు ప్రజల జీవితాలను ప్రభావితం చేశాయి. ముఖ్యంగా సంప్రదాయ మత్స్యకార సమాజాలు అభివృద్ధికి దూరంగా ఉన్న పరిస్థితిని బాలయ్య దగ్గరగా గమనించారు.విద్య, ఐక్యత, సంఘటిత శక్తి ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన బలంగా విశ్వసించారు. అదే ఆయన జీవితానికి ప్రధాన మార్గదర్శక సూత్రంగా మారింది.

ప్రజా చైతన్యమే ఆయన జీవిత ధ్యేయం

సందిరి బాలయ్య ప్రజల్లో చైతన్యం తీసుకురావడాన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించారు. రవాణా సౌకర్యాలు అంతగా లేని కాలంలో గ్రామగ్రామాన కాలినడకన తిరుగుతూ ప్రజలను కలుసుకునేవారు.ఆయన వెంట పలకా బలపాలు తీసుకెళ్లి, అక్షరజ్ఞానం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించేవారు. నిరక్షరాస్యతను రూపుమాపడం, పిల్లలను చదివించడం, ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, సామాజిక వివక్షను ఎదుర్కోవడం ఆయన ప్రధాన లక్ష్యాలుగా ఉండేవి.ప్రజల మధ్య ఉన్న కుల, ప్రాంత, పేరు, ఆచారాల ఆధారిత విభేదాలను పక్కనపెట్టి సంప్రదాయ మత్స్యకార సమాజం ఒకే సంఘటిత శక్తిగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు."మనమంతా ఒక్కటే" అనే భావనను ప్రజల్లో బలంగా నాటేందుకు ఆయన నిరంతరం కృషి చేశారు.

1934 - గంగపుత్ర సంఘ స్థాపన

సందిరి బాలయ్య గారి జీవితంలో 1934 సంవత్సరం ఒక చారిత్రక మలుపు.నాటి హైదరాబాద్ రాష్ట్రంలో, అఫ్జల్‌గంజ్ సమీపంలోని లిలిఅశోక్ బజార్‌లో "గంగపుత్ర సంఘం"లిలిను ఆయన స్థాపించారు. సంప్రదాయ మత్స్యకార కులాలను ఒకే వేదికపైకి తీసుకురావాలనే గొప్ప లక్ష్యంతో ఈ సంఘాన్ని నిర్మించారు.ఈ సంఘ నిర్మాణంలో పిట్టెల నాగయ్య, మధునాల లింగయ్య, గుంటి రామయ్య, గుర్రపు బాబాయ్, పూస భద్రయ్య, చుక్కల బాలకిష్టయ్య, మెట్టు లక్ష్మయ్య తదితరులు సహకరించారు.సంఘానికి సందిరి బాలయ్య గారు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.ఆయన నాయకత్వంలో సంఘం కేవలం ఒక సంస్థగా కాకుండా, గంగపుత్ర సమాజంలో ఐక్యత, సామాజిక చైతన్యం, విద్యా ప్రాధాన్యత, సంఘటిత శక్తి వంటి భావాలను వ్యాప్తి చేసే వేదికగా ఎదిగింది.

1938-1941 - వార్షికోత్సవ మహాసభలు

గంగపుత్ర సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి బాలయ్య గారు వార్షికోత్సవ మహాసభల సంప్రదాయాన్ని ప్రారంభించారు.

1938 – మొదటి వార్షికోత్సవ మహాసభ

1940 – రెండవ వార్షికోత్సవ మహాసభ

1941 – మూడవ వార్షికోత్సవ మహాసభ

ఈ మహాసభల ద్వారా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న సంప్రదాయ మత్స్యకారులను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ప్రయత్నించారు.సమాజ సమస్యలను చర్చించడం, ప్రజలలో ఐక్యత పెంచడం, సంఘ నిర్మాణాన్ని విస్తరించడం, విద్యా చైతన్యాన్ని పెంపొందించడం వంటి అంశాలకు ఈ మహాసభలు ప్రాధాన్యత ఇచ్చాయి.



1944 - జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు సంఘ విస్తరణ

1944లో గంగపుత్ర సంఘ కార్యకలాపాలను హైదరాబాద్ నగరానికి మాత్రమే పరిమితం చేయకుండా జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు విస్తరించాలనే దిశగా బాలయ్య గారు ముందడుగు వేశారు.హైదరాబాద్ హనుమాన్ టేక్డీలో తోపారపు గంగారాం, గడప భూమయ్య, సందిరి మల్లేశం, మైస పరుశురాం, సందిరి ముత్యాలు, సందిరి ఎల్లయ్య తదితరులతో సమావేశాలు నిర్వహించి, వారి సహకారంతో జిల్లాల గంగపుత్ర ప్రచార సంఘాలను ఏర్పాటు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.గ్రామీణ ప్రాంతాల్లో సంఘాలను ఏర్పాటు చేయడం, ప్రజల్లో సామాజిక చైతన్యం కల్పించడం, సహకార సంఘాల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇవ్వడం వంటి కార్యక్రమాలు చేపట్టారు.సంఘాల ద్వారా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ప్రతి సంవత్సరం మహాసభలు నిర్వహించి సమాజ సమస్యలను చర్చించే సంప్రదాయాన్ని కొనసాగించారు.

"గంగాజ్యోతి" - ప్రచార మాధ్యమం ద్వారా చైతన్యం

ప్రజల్లో చైతన్యం పెంపొందించడానికి సమాచార ప్రచారం ఎంత ముఖ్యమో సందిరి బాలయ్య గారు గుర్తించారు.గంగపుత్రుల సామాజిక, సాంస్కృతిక అంశాలను ప్రజలకు చేరవేయడానికి సంఘం ద్వారా "గంగాజ్యోతి" అనే మాసపత్రికను నడిపించారు.సమాజ చరిత్ర, సంప్రదాయాలు, సామాజిక పరిస్థితులు, సంఘ కార్యకలాపాలు వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రచార మాధ్యమాన్ని ఉపయోగించారు.ఇది కేవలం ఒక పత్రికా ప్రయత్నం మాత్రమే కాదు; తమ చరిత్రను తామే నమోదు చేసుకోవాలనే ఆలోచనకు నాందిగా నిలిచింది.

గ్రంథ పరిశోధక మండలి - చరిత్ర పరిరక్షణకు కృషి

గంగపుత్ర సమాజ చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించాలనే ఉద్దేశంతో గంగపుత్ర నాయకులు, మేధావులతో కలిసి "గ్రంథ పరిశోధక మండలి" ఏర్పాటుకు బాలయ్య గారు కృషి చేశారు.కరపత్రాల రూపంలో సమాచారాన్ని ప్రచురించడం, చారిత్రక వివరాలను సేకరించడం, సమాజ చరిత్రను భద్రపరచడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారు.సమాజానికి గతం తెలియాలి, చరిత్రపై అవగాహన ఉండాలి, తమ పూర్వీకుల కృషిని భావితరాలు గుర్తించాలి అనే ఆలోచన ఆయనలో బలంగా ఉండేది.

1953 - వెనుకబడిన తరగతుల గుర్తింపు కోసం సామాజిక ఉద్యమం

1953లో హైదరాబాద్ రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల కమీషన్‌కు సంబంధించిన ప్రక్రియలో, శ్రీ బొజ్జం నర్సింహులు గారి నాయకత్వంలో సంప్రదాయ మత్స్యకారులైన బెస్త, గూండ్ల కులాలను బీసీ–ఏ వర్గీకరణలో క్రమ సంఖ్య 1లో చేర్చినట్లు మీరు అందించిన చరిత్రలో పేర్కొనబడింది.సంప్రదాయ మత్స్యకార సమాజాల సామాజిక స్థితిగతులు, వారి వెనుకబాటుతనం, అభివృద్ధి అవసరాలు వంటి అంశాలపై సాగిన సామాజిక ఉద్యమంలో ఈ పరిణామం ప్రాధాన్యతను సంతరించుకుంది.సామాజిక గుర్తింపు, విద్య, ఉపాధి, అభివృద్ధి అవకాశాలు సమాజానికి అందాలనే ఆకాంక్ష ఈ కాలంలోని ఉద్యమాల్లో ప్రతిఫలించింది.

1954 - అఖిల హైదరాబాద్ రాష్ట్ర గంగపుత్ర మహాసభలు

సందిరి బాలయ్య గారి నాయకత్వ ప్రస్థానంలో 1954 సంవత్సరం మరో ముఖ్యమైన ఘట్టం.జూన్ 25, 26, 27 తేదీలలో, హైదరాబాద్ కాచిగూడ ప్రాంతంలోని తుల్జాభవన్‌లో ఆయన అధ్యక్షతన "అఖిల హైదరాబాద్ రాష్ట్ర గంగపుత్ర మహాసభలు" నిర్వహించబడ్డాయి.నాటి హైదరాబాద్ రాష్ట్రంలోని 16 జిల్లాల నుంచి గ్రామాలు, మండలాలు, మారుమూల ప్రాంతాల నుంచి సంప్రదాయ మత్స్యకార సమాజానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వివిధ ప్రాంతాల్లో విస్తరించి ఉన్న ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావడం, వారి సమస్యలను చర్చించడం, సామాజిక ఐక్యతను బలోపేతం చేయడం ఈ మహాసభల ప్రధాన లక్ష్యాలుగా నిలిచాయి.

1956 - ప్రదేశ్ గంగపుత్ర సంఘం స్థాపన

1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత, గంగపుత్రుల సంఘటిత ఉద్యమాన్ని రాష్ట్రస్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం జరిగింది.తెలంగాణ ప్రాంతంలోని బెస్త, గూండ్లతో పాటు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలవబడుతున్న సంప్రదాయ మత్స్యకార సమాజాలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి సంఘ ప్రతినిధులతో చర్చలు జరిగాయి.ఈ క్రమంలో ఒక నిర్దిష్ట నియమావళితో రాష్ట్రస్థాయి సంఘాన్ని ఏర్పాటు చేసి దానికి "ప్రదేశ్ గంగపుత్ర సంఘం" అనే పేరు పెట్టి 51/1956 రిజిస్ట్రేషన్ చేయించినట్లు అందించిన చరిత్రలో పేర్కొనబడింది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన అదే సంవత్సరంలో రాష్ట్రస్థాయి సంఘ నిర్మాణానికి ప్రయత్నించడం సందిరి బాలయ్య గారి దూరదృష్టికి నిదర్శనంగా భావించబడుతుంది.గ్రామాలు, పట్టణాల్లో సంఘాలను ఏర్పాటు చేయడం, ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని విస్తరించడం, గంగపుత్రులను సంఘటితం చేయడం, సమాజ అభ్యున్నతికి కృషి చేయడం వంటి లక్ష్యాలను ఈ సంస్థ ద్వారా ముందుకు తీసుకెళ్లారు.

కుటుంబ సభ్యులు, సహచరుల సహకారం

సందిరి బాలయ్య గారి సంఘ నిర్మాణ కార్యక్రమాల్లో ఆయన సోదరులు సందిరి పోచయ్య గారు, సందిరి చిన్నబాలయ్య గారు కూడా చురుకుగా పాల్గొన్నారుఅలాగే వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు ఆయనకు సహకరించారు.ఒక వ్యక్తి ఆలోచనకు సమాజం సహకారం కలిసినప్పుడు మాత్రమే ఉద్యమం బలపడుతుందని నిరూపించే విధంగా ఈ సమష్టి కృషి గంగపుత్ర సంఘ ఉద్యమ విస్తరణకు తోడ్పడింది.

1967 - మహానేతకు వీడ్కోలు

సమాజం కోసం జీవితాంతం కృషి చేసిన సందిరి బాలయ్య గారు 1967 జనవరి 7వ తేదీన మరణించారు.ఆయన మరణం గంగపుత్ర సమాజానికి తీరని లోటుగా నిలిచింది.

అయితే ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ, ఆయన నిర్మించిన సంఘటిత ఉద్యమ ఆలోచన, విద్యా చైతన్యం, ఐక్యత, ఆత్మగౌరవం, సామాజిక అభివృద్ధి వంటి ఆశయాలు సమాజంలో కొనసాగుతూనే ఉన్నాయి.

సందిరి బాలయ్య గారి వారసత్వం

సందిరి బాలయ్య గారు కేవలం ఒక సంఘాన్ని స్థాపించిన నాయకుడు కాదు.ఆయన విద్యా చైతన్యానికి ప్రాధాన్యత ఇచ్చిన సామాజిక సంస్కర్త

గంగపుత్రుల ఐక్యతకు కృషి చేసిన సంఘటకుడు

సామాజిక వివక్షకు వ్యతిరేకంగా చైతన్యం కల్పించిన నాయకుడు

సంఘ నిర్మాణానికి మార్గదర్శకుడు

సమాజ చరిత్ర పరిరక్షణకు కృషి చేసిన దార్శనికుడు

ప్రజల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించిన మహానీయుడు

గా గంగపుత్రుల చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు.

1934లో గంగపుత్ర సంఘ స్థాపన నుంచి 1938–1941 మహాసభలు, 1944లో జిల్లాల విస్తరణ, "గంగాజ్యోతి" ద్వారా ప్రచారం, గ్రంథ పరిశోధక మండలి, 1954 అఖిల హైదరాబాద్ రాష్ట్ర గంగపుత్ర మహాసభలు, 1956 ప్రదేశ్ గంగపుత్ర సంఘం వరకు సాగిన ఆయన ప్రయాణం సంఘటిత సామాజిక ఉద్యమ నిర్మాణానికి ఒక చారిత్రక అధ్యాయంగా నిలిచింది.

నేటి తరానికి ఆయన సందేశం

సందిరి బాలయ్య గారి జీవితాన్ని పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది–సమాజ అభివృద్ధికి కేవలం ఆర్థిక ప్రగతి సరిపోదు; విద్య, ఐక్యత, ఆత్మగౌరవం, సంఘటిత శక్తి, చారిత్రక అవగాహన కూడా అవసరం.ఆయన ఆశయాలను కొనసాగించాలంటే గంగపుత్ర సమాజంలో విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలి. ఉపాధి అవకాశాలను పెంపొందించాలి. సమాజంలో ఐక్యతను కాపాడాలి. చరిత్రను భావితరాలకు అందించాలి.ముఖ్యంగా సంఘాలు, మేధావులు, రచయితలు, జర్నలిస్టులు, గాయకులు, కళాకారులు, సామాజిక ఉద్యమకారులు, యువత, మహిళలు కలిసి సమాజ అభివృద్ధికి పనిచేయడం ద్వారా ఆయన కలలను సాకారం చేయవచ్చు.ఘన నివాళి గంగపుత్ర జాతిపిత ఆచార్య సందిరి బాలయ్య గారి జీవితం ఒక వ్యక్తి జీవిత చరిత్ర మాత్రమే కాదు; అది ఒక సమాజం ఐక్యత కోసం సాగించిన ఉద్యమ చరిత్ర.ఆయన చూపిన మార్గంలో విద్య, ఐక్యత, ఆత్మగౌరవం, సంఘటిత శక్తి, సామాజిక అభివృద్ధి అనే విలువలను ముందుకు తీసుకెళ్లడం నేటి తరానికి గొప్ప బాధ్యత.గంగపుత్ర సమాజం ఒక్కటిగా నిలిచి, విద్యా,ఉపాధి,సామాజిక,ఆర్థిక అభివృద్ధి దిశగా ముందుకు సాగడమే గంగపుత్ర జాతిపిత ఆచార్య సందిరి బాలయ్య గారికి మనం అర్పించే నిజమైన ఘన నివాళి.

"మనమంతా ఒక్కటై
విద్యతో ఎదిగి
సంఘటిత శక్తితో పోరాడి
ఆత్మగౌరవంతో జీవించాలి."
గంగపుత్ర జాతిపిత ఆచార్య సందిరి బాలయ్య గారి
ఆశయాలు వర్ధిల్లాలి!
గంగపుత్రుల ఐక్యత వర్ధిల్లాలి!
ఇట్లు
మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర
రాష్ట్ర అధ్యక్షులు
గంగపుత్ర చైతన్య సమితి
9182844816

15 ఏళ్లుగా సాగు చేసిన భూమి మాధవిదే కాదా..

- భూమి అమ్మిన కొనుగోలు చేసిన ఇద్దరు వ్యక్తులు మృతి
- భర్త సమాధి ఉన్న భూమి కోసం భార్య పోరాటం..
- మాధవికి న్యాయం చేసేదెవరు..?
-రెవెన్యూ అధికారులకు మాధవి సూటి ప్రశ్నలు.!
- దొంగ పట్టా చేసిన జి పి ఓ, ఆర్ ఐ, ఎమ్మార్వో పై చర్యలు తీసుకోవాలంటు బాధితురాలు వేడుకోలు



ప్రజా వాయిస్, మానకొండూర్ (నవంబర్ 10):

కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన మద్ది మాధవి కి రావాల్సిన వాటా 0.15 గుంటల భూమిని తన బావ మద్ది లక్ష్మణ్ అక్రమంగా పట్టా చేసుకుని తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బాధితురాలు ప్రజావాయిస్ న్యూస్ ని ఆశ్రయించింది.. తనకు న్యాయం చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా, 15 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగించిన భూమిపైనే ఇప్పుడు హక్కులు కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితురాలి కథనం ప్రకారం.. 1997లో చెంజర్ల గ్రామానికి చెందిన బోళ్ల పరమేశ్వరయ్య, మద్ది మల్లయ్య కు సర్వే నం,, 568/ఆ/2 లో రెండు ఎకరాల రెండు గుంటల భూమికి సాదా బైనామా రాసిచ్చారు. అనంతరం



పరమేశ్వరయ్య, మద్ది మల్లయ్య ఇద్దరూ మరణించారు. మద్ది మల్లయ్యకు ఐదుగురు వారసులు ఉండగా ఇద్దరు కుమారులు మరణించారు. ఇలాంటి పరిస్థితుల్లో మిగిలిన చిన్న కుమారుడు మద్ది లక్ష్మణ్‌కు మాత్రమే భూమిపై పూర్తి హక్కులు ఎలా వస్తాయని ఆమె ప్రశ్నిస్తున్నారు. తన మామ సంతకాల ఫోర్జరీతో ఆర్ఓఆర్ రికార్డులు చేయించుకుని, తన అన్న కుమారులకు సేల్ డీడ్ చేసినట్లు మద్ది లక్ష్మణ్‌పై ఆరోపణలు సంధిస్తున్నారు. ఈ వ్యవహారంలో తనకు రావాల్సిన 15 గుంటల భూమిని దక్కకుండా చేస్తున్నారని వాపోతున్నారు.

భర్త సమాధి ఉన్న భూమి కోసం భార్య పోరాటం..

గత 15 సంవత్సరాలుగా ఈ భూమిని సాగు చేసుకుంటున్నానని, తన భర్త రాజు తెలంగాణ ఉద్యమకారుడని, ఆయన మరణించినప్పుడు అంత్యక్రియలు నిర్వహించి, అదే భూమిలో ఆయన సమాధిని నిర్మించుకున్నామని మాధవి కన్నీటిపర్యంతమయ్యారు. భర్త జ్ఞాపకాలు ముడిపడిన భూమిపైనే ఇప్పుడు హక్కు లేదంటూ ప్రశ్నించడం ఎంతవరకు న్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదని తెలిపారు.

రెవెన్యూ అధికారులకు మాధవి సూటి ప్రశ్నలు.!

1997 సాదా బైనామా ఆధారంగా జరిగిన భూమి లావాదేవీలను ఎందుకు పూర్తిస్థాయిలో పరిశీలించకూడదు. ఆర్ ఓ ఆర్ లోని భూమికి డాక్యుమెంట్ లేకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు. మద్ది మల్లయ్య ఐదుగురు వారసుల హక్కులు, వాటాలను తేల్చకుండా ఒక్కరికే పూర్తి హక్కులు ఎలా కల్పించారు. మా మామ సంతకాలపై వచ్చిన ఫోర్జరీ ఆరోపణలపై విచారణ ఎప్పుడు మొదలు పెడతారు. 15 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న నాకు న్యాయం చేస్తారా లేదా..? అంటూ ఈ సాదబైనామా భూమిపై ఎలాంటి ఆధారాలు పరిగణలోకి తీసుకోకుండా, భూమి విక్రయించిన బోళ్ల పరమేశ్వరయ్య కుటుంబం సభ్యుల వాంగ్మూలం సేకరించకుండా ఎట్ల జి.పి.ఓ., ఆర్.ఐ, ఎమ్మార్వో ఈ భూమి రిజిస్ట్రేషన్ కి ముందుకు సాగుతారని తీవ్రస్థాయిలో ప్రశ్నల వర్షం కురిపించారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు ఈ ఘటన పై స్పందిస్తూ చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దొంగ పట్టాలు చేసిన రెవెన్యూ ఉన్నతాధికారులపై సమగ్ర విచారణ జరిపి, తనకు చట్టబద్ధంగా రావాల్సిన 15 గుంటల భూమిని ఇప్పించాలని మద్ది మాధవి వేడుకుంటున్నారు..





ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 10 :

చిలుకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.